


కొత్త పంతుళ్లు వస్తున్నారు..!



- రేపటి నుంచి విధుల్లోకి నూతన ఉపాధ్యాయులు
- ముగిసిన డీఎస్సీ శిక్షణ తరగతులు
- కోరుకున్న చోటే పోస్టింగ్
- లీప్ యాప్‌లోనే పోస్టింగ్ ఉత్తర్వులు
- ఉమ్మడి జిల్లాలో 2,627 మంది నియామకం

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలకు కొత్త టీచర్లు రానున్నారు. ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు గత నెల 25న విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. ఇలాంటి కార్యక్రమం దేశంలోని ఏ రాష్ట్రంలోనూ జరగలేదని విద్యావేత్తలు, అధికారులు, ఉద్యోగులు పేర్కొంటున్నారు. ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైన వారికి అక్టోబరు 3వ తేదీ నుంచి జిల్లా కేంద్రాల్లో 10వ తేదీ వరకు 8రోజుల పాటు విద్యారంగ విషయాలు, వస్తున్న మార్పులు, సంస్కరణలు, బోధన పద్ధతులు, సాంకేతికతను అందిపుచ్చుకునే విధంగా నిష్ణాతులైన వారితో శిక్షణ ఇప్పించారు. ఉపాధ్యాయ సంఘాల కోరిక మేరకు ఎస్‌జీటీ టీచర్లకు కౌన్సెలింగ్ నిర్వహించి నూతన ఉపాధ్యాయులు కోరుకున్న చోట పోస్టింగ్ ఉత్తర్వులను అందజేసే చర్యలు చేపట్టింది. లీప్ యాప్‌లోనే వారికి పోస్టింగ్ ఉత్తర్వులు జారీ చేయనున్నారు. మెగా డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన ఉపాధ్యాయులు సోమవారం విధులకు హాజరుకావాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామ రాజు ఆదేశాలు జారీ చేశారు.

ఏకోపాధ్యాయ విధానానికి స్వస్తి

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఏకోపాధ్యాయ పాఠశాలలకు స్వస్తి పలకనున్నారు. ఆయా పాఠశాలల్లో పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులతో పాఠశాలలు కళకళలాడనున్నాయి. పాఠశాలల విద్యను బలోపేతం చేయడమే దిశగా ప్రభుత్వం ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి చర్యలు చేపట్టింది. రాష్ట్రంలోనే అత్యధికంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2,627 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశారు. కొత్త గురువులు పాఠశాలలో చేరితే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందే అవకాశాలు మెండుగా ఉన్నాయని పలువురు భావిస్తున్నారు. పశ్చిమ ప్రాంతమైన ఆదోని డివిజన్‌లోని పలు పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత అధికంగా ఉంది. ఈ ప్రాంతం నుంచే 1,156 మంది ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు పొందడం గమనార్హం. ఉద్యోగాలకు ఎంపికైన వారికి సమీప గ్రామాల్లో పోస్టింగ్ ఇచ్చినట్లయితే ఆయా పాఠశాలలు మరింత బలోపేతమయ్యే అవకాశాలు ఉన్నాయని విద్యాశాఖ అధికారులు భావిస్తున్నారు.



ప్రధాని పర్యటన ఏర్పాట్లు వేగవంతం



శ్రీశైలం క్షేత్రంలో ఏర్పాటు చేసిన బారికేడ్లు

శ్రీశైలం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ఈ నెల 16వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ శ్రీశైలం మల్లన్న దర్శనార్థం రానున్నారు. ఈ నేపథ్యంలో ఏర్పాట్లను వేగవంతం చేశారు. సుండిపెంట కాలనీ నుంచి శ్రీశైలం వరకు పారిశుధ్య పనులు రోడ్లకు ఇరువైపులా మట్టి చదును పనులు, హెలిప్యాడ్ వద్ద బారికేడ్ల పనులు జరుగుతున్నాయి. అలాగే ముఖద్వారం నుంచి ఆర్చీలకు రంగులు, క్షేత్రంలో బారికేడ్ల ఏర్పాటు, రోడ్లకు ఇరువైపులా కాంక్రీట్ పనులు, మాడవీధుల్లో సీసీ కెమెరాల ఏర్పాటు, ఆలయ గంగాధర మండపం వద్ద తారు రోడ్డు పనులు, బందోబస్తుకు పందిళ్లు, ఆలయం ప్రధాన ద్వారం నుంచి రాజగోపురం వరకు అందమైన పూలమొక్కలు, ఆలయ లోపల క్యూలైన్లకు రంగులు, స్వామివారి ఆలయ నుంచి అమ్మవారి ఆలయం వరకు టెన్‌జైల్డ్ ఫ్యాబ్రికేషన్ పందిళ్లు, గోడలకు చిత్రాలు, క్షేత్రంలో పచ్చదనంతో సుందరీకరణ మొక్కలు, అతిథిగృహం వద్ద కార్పెంటర్ వర్క్స్ తదితర పనులు వేగంగా జరుగుతున్నాయి. ఆయా శాఖల అధికారులు పనులను పర్యవేక్షిస్తున్నారు.



ట్రాక్టర్‌లో చెత్తను తరలిస్తున్న కార్పొరేషన్ సిబ్బంది




రహదారి వెంట చెత్తను ఏరుతున్న సిబ్బంది



స్వామి వారి ఆలయం చుట్టూ ఫ్యాబ్రిక్ పందిళ్లు

జీఎన్‌ఎస్‌ఎస్ గేట్లు మూసివేత



మూసివేసిన జీఎన్‌ఎస్‌ఎస్ హెడ్ రెగ్యులేటర్ గేట్లు

అవుకు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): అవుకు రిజర్వాయర్ నుంచి కడప జిల్లాకు నీటిని తరలించే జీఎన్‌ఎస్‌ఎస్ హెడ్‌రెగ్యులేటర్ గేట్లను ఎస్సార్బీసీ అధికారులు శనివారం మూసివేశారు. జీఎన్‌ఎస్‌ఎస్ కెనాల్ నుంచి అవుకు రిజర్వాయర్‌కు నీటి సరఫరా నిలిచిపోయింది. ఎస్సార్బీసీ కాలువ ద్వారా 350 క్యూసెక్కుల నీరు వచ్చి రిజర్వాయర్‌కు చేరుతుంది. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 2.51 టీఎంసీలు నీరు మాత్రమే నిల్వ ఉంది. తిమ్మరాజు చెరువు లోపలి రివిట్‌మెంట్ కుంగి మట్టికట్టల నుంచి లీకేజీ రూపంలో నీరు బయటకు వస్తుండటంతో రిజర్వాయర్‌లో నీటి నిల్వ శాతాన్ని తగ్గించారు. జీఎన్‌ఎస్‌ఎస్ కెనాల్ నుంచి రిజర్వాయర్‌కు వచ్చే ఇన్‌ఫ్లో నిలిచిపోవటంతో కడప జిల్లాకు నీటిని తరలించే జీఎన్‌ఎస్‌ఎస్ హెడ్‌రెగ్యులేటర్ గేట్లను మూసివేశారు. రిజర్వాయర్ నుంచి 12ఏ బ్లాక్ (సంగపట్నం) కాలువ ద్వారా ఆయకట్టుకు 340 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. లోకల్ ఆయకట్టుకు 40 క్యూసెక్కుల నీరు విడుదల చేసినట్లు ఎస్సార్బీసీ అధికారులు తెలిపారు.

చెత్త తరలింపు అడ్డగింత



లారీలను ఆపుతున్న కాలనీ వాసులు, మున్సిపల్ చైర్మన్

- లారీలు పోలీస్ స్టేషన్‌కు తరలింపు
- లెగసీ వేస్ట్‌ను ప్రాసెసింగ్ చేయడంతో సమస్యలు
- మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి

నందికొట్కూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు నుంచి చెత్తను లెగసీ వేస్ట్ ప్రాసెసింగ్ చేసేందుకు నందికొట్కూరుకు తరలిస్తుండగా ప్రజలు, ప్రజా ప్రతినిధులు అడ్డుకున్నారు. లారీల ద్వారా తరలిస్తున్న చెత్త వల్ల దుర్వాసన, దుమ్ము వస్తోందని బ్రహ్మంగారి మఠం సమీపంలోని కాలనీ వాసులు, కౌన్సిలర్ చాంద్‌బాషా శనివారం వాహనాలను నిలిపేశారు. మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అక్కడి చేరుకొని సమస్యను తెలుసుకొని వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నందికొట్కూరు డంప్ యార్డులోని లెగసీ వేస్ట్‌ను ప్రాసెసింగ్ చేయడం వల్ల దుమ్ము సమీపంలోని కాలనీల్లోకి వస్తుందని, ప్రజలు ఇబ్బందులకు గురవుతారన్నారు. పట్టణానికి దూరంగా ఈ ప్రాసెసింగ్‌ను ఏర్పాటు చేసుకొని ఇక్కడి చెత్తతో పాటు ఆత్మకూరు డంప్ యార్డులోని చెత్తను కూడా అక్కడే ప్రాసెసింగ్ చేసుకోవాలని ఆయన సూచించారు. కాలనీవాసులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సీపీఎం నాయకులు పక్కీర్ సాహెబ్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

19,700 టన్నుల చెత్త రీసైక్లింగ్

నందికొట్కూరు డంప్ యార్డులో 19,700 టన్నుల చెత్తను రీసైక్లింగ్ చేసేందుకు ప్రభుత్వం గుత్తేదారులను ఆహ్వానించిందన్నారు. నందికొట్కూరులోని 19,700 టన్నుల చెత్తతో పాటు, ఆత్మకూరులో 3వేల టన్నుల చెత్తను నందికొట్కూరు డంప్ యార్డులోనే ప్రాసెసింగ్ చేసేందుకు కాంట్రాక్టర్ టెండర్ దక్కించుకున్నారు. దీంతో నందికొట్కూరు డంప్ యార్డులోని చెత్తను ఒక చోటికి తరలించడంతో పాటు ఆత్మకూరు డంప్ యార్డులో ఉన్న దాదాపు 2,500 టన్నుల చెత్తను ఇక్కడి తరలించినట్లు తెలుస్తోంది. ప్రాసెసింగ్ చేసేందుకు గుత్తేదారు సిద్ధంగా ఉన్నారు.

సమన్వయంతో ముందుకు సాగాలి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి

- ప్రధాని పర్యటనను విజయవంతం చేయాలి
- మంత్రులు బీసీ జనార్దన్‌రెడ్డి, టీజీ భరత్
- 250 సీసీ కెమెరాలు ఏర్పాటు
- ప్రధానమంత్రి ప్రోగ్రాం స్పెషలాఫీసర్ వీర పాండియన్
- సభ పరిసరాల్లో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి : కలెక్టర్ ఏ.సిరి
- కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు : ఎస్పీ విక్రాంత్

కర్నూలు అర్బన్/ ఓర్వకల్లు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రధాని పర్యటనను మన కుటుంబంలో జరుగుతున్న ఓ కార్యక్రమంగా భావించి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగాలని మంత్రులు బీసీ జనార్దన్‌రెడ్డి, టీజీ భరత్ అన్నారు. ఈ నెల 16న ఉమ్మడి జిల్లాలో ప్రధాని మోదీ పర్యటనను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. మండలంలోని నన్నూరు టోల్ ప్లాజా సమీపంలోని కంట్రోల్ రూమ్‌లో ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో మంత్రులు బీసీ, టీజీ, ప్రధానమంత్రి ప్రోగ్రామ్ స్పెషల్ ఆఫీసర్, సీనియర్ ఐఏఎస్ అధికారి వీరపాండియన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఐపీఎస్, రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ రాబోయే మూడు, నాలుగు రోజులు కష్టపడి పనిచేస్తేనే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయగలమన్నారు. సభా ప్రాంగణంలో పార్కింగ్ వద్ద 1, 2 ర్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. భోజనం పంపిణీలో సమస్యలు తలెత్తకుండా నిర్దేశిత ప్రాంతాల్లో భోజనం ఏర్పాట్లు చేయడం ద్వారా ప్రణాళికబద్ధంగా వ్యవహరించాలన్నారు. దూర ప్రాంతాల నుంచి సభకు వచ్చే వారికి ఆహార ఏర్పాట్లపై దృష్టి పెట్టాలన్నారు.

మిగతా 6వ పేజీలో

ఒక గేటుతో నీటి విడుదల

- నీటి మట్టం 884 అడుగులు
- నీటి నిల్వ సామర్థ్యం 214 టీఎంసీలు

శ్రీశైలం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం జలాశయంలో మళ్లీ వరద ప్రవాహం పెరిగింది. ఒక గేటును 10 అడుగు ఎత్తు మేరకు తెరిచి నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం రెండు విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి అనంతరం 66,134 క్యూసెక్కులు విడుదల చేశారు. శనివారం సాయంత్రం 6 గంటల సమయానికి నీటిమట్టం 884 అడుగులు, నీటినిల్వ సామర్థ్యం 214 టీఎంసీలుగా నమోదైంది. ఎగువ జూరాల స్పిల్‌వే, విద్యుత్ ఉత్పత్తి, సుంకేసుల, హంద్రీ నుంచి మొత్తం 74,927 క్యూసెక్కులు ఇన్‌ఫ్లోగా వచ్చి చేరాయి. శ్రీశైలం కుడి, ఎడమ జలవిద్యుత్ కేంద్రాల్లో గడిచిన ఇరవై నాలుగు గంటల్లో 30.737 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసి జెన్- కో అధికారులు గ్రిడ్‌కు అనుసంధానం చేశారు.



ఒక గేటుతో కొనసాగుతున్న నీటి విడుదల

జేసీగా కార్తీక్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు తీసుకుంటున్న జేసీ కార్తీక్

నంద్యాల నూనెపల్లి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): నంద్యాల కలెక్టరేట్ కార్యాలయంలో శనివారం కొల్ల బత్తుల కార్తీక్ నూతన జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అధికారుల సమక్షంలో బాధ్యతలు స్వీకరించగా సహచర అధికారులు సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జేసీ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. జిల్లా అభివృద్ధి కార్యక్రమాల అమలు, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేసే దిశగా అధికారులు సమష్టిగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో రామునాయక్, తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమ రాష్ట్ర సాధనకు ఉద్యమిద్దాం

- రాయలసీమ రాష్ట్ర సమితి జాతీయ అధ్యక్షుడు కుంచం వెంకటసుబ్బారెడ్డి 7

కొలనుభారతి క్షేత్రానికి మహర్దశ..! 6

నిలిచిన వైద్య సేవలు



నారాయణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

- వైద్యుల సమ్మెతో పీహెచ్‌సీలు వెలవెల
- వైద్యం కోసం రోగుల అవస్థలు

నంద్యాల హాస్పిటల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా వైద్యులు సమ్మెబాట పట్టడంతో వైద్య సేవలు స్తంభించాయి. వైద్యుల సమ్మెతో పీహెచ్‌సీలు వెలవెలబోతున్నాయి. వైద్యం కోసం వచ్చే రోగులు అవస్థలు పడుతున్నారు. డిమాండ్ల సాధన కోసం జిల్లావ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు అక్టోబరు ఒకటి నుంచి సమ్మెలో ఉన్నారు. 11రోజుల నుంచి పీహెచ్‌సీ వైద్యులు విధులకు హాజరు కాకపోవడంతో రోగులు అవస్థలు పడుతున్నారు. గర్భిణులు నెలవారీ పరీక్షల కోసం పడే పాట్లు అన్నీఇన్నీకావు. ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లేందుకు ఆర్థిక స్తోమత లేనివారంతా సమ్మె ఎప్పుడు ముగిస్తుందా అని వేచి చూస్తున్నారు.



వైద్యుడు లేక వెలవెలబోతున్న పీహెచ్‌సీ

చర్చలు జరపకపోవడంపై..

పీహెచ్‌సీల వైద్యులు సమ్మెలో ఉంటే స్పందించాల్సిన అధికార యంత్రాంగం వారితో చర్చలు జరపకపోవడంపై అటు సమ్మెలో ఉన్న వైద్యులు, ఇటు ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. గిరిజన ప్రాంతాల పరిస్థితి మరింత దారుణంగా మారింది. సిబ్బంది కొరతతో కొట్టుమిట్టాడుతున్న గిరిజన ప్రాంత పీహెచ్‌సీలు ఉన్న అరకొర సిబ్బంది కూడా వైద్యుల సమ్మెబాటతో పీహెచ్‌సీల వైపు చూడటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. జిల్లాలో 56 పీహెచ్‌సీలు ఉండగా 112 మంది వైద్యులు విధులు నిర్వహిస్తున్నారు. పీహెచ్‌సీ వైద్యులు సమ్మెలో ఉండటంతో డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థులు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం అవస్థలు పడాల్సి వచ్చింది.

డిమాండ్లను పరిష్కరించాలి



పీహెచ్‌సీ వైద్యుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి. కొన్నేళ్లుగా నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వడం లేదు. ప్రభుత్వం చర్చలకు పిలిచి సమస్యను పరిష్కరించాలి.

- డాక్టర్ అంకిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు, ఏపీపీహెచ్‌సీడీఏ, నంద్యాల

వైద్యుల డిమాండ్లు ఇవే..

టైం బౌండ్ ప్రమోషన్లు ఇవ్వాలి. గత 25ఏళ్లుగా ప్రమోషన్‌కు నోచుకోలేదు. జీవో 99 రద్దుచేసి డిపార్ట్‌మెంట్‌లో క్లినికల్ 30శాతం, నాన్‌క్లినికల్ 50శాతం ఇన్‌సర్వీస్ సీట్లు కల్పించాలి. ట్రైబల్ పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న వైద్యులకు ట్రైబల్ అలవెన్స్ ఇవ్వాలి. నోషనల్ ఇంక్రిమెంట్లు కల్పించాలి. మూడేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న చంద్రన్న సంచార చికిత్స అలవెన్స్ ఇవ్వాలి.

డిప్యుటేషన్‌పై వైద్యులను..




జిల్లాలో పీహెచ్‌సీ వైద్యులు సమ్మెలో ఉన్న కారణంగా డిప్యుటేషన్‌పై 56మంది వైద్యులను నియమించాం. ముఖ్యంగా రోగులకు ఎలాంటి అసౌకర్యం లేదు.

- డాక్టర్ వెంకటరమణ, డీఎంహెచ్‌వో, నంద్యాల

తుంగభద్ర తీరం

సాహిత్యం

నవరస భరితం జగదేక సుందరి సామా



కర్నూలు కల్చరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): వందేళ్ల చరిత్రగల 'చింతామణి' నాటకం ఆంధ్రదేశమంతటా ప్రదర్శించని పల్లెటూరంటూ ఏదీ లేదు. అంతటి ఘనతర ఖ్యాతిగాంచిన ఈ నాటకాన్ని గత ప్రభుత్వం నిషేధించింది. ఒక వర్గానికి చెందిన వారి మనోభావాలు దెబ్బతినే రీతిలో ఈ నాటకంలోని సంభాషణలు ఉన్నాయని ఈ నిషేదానికి కారణం. అయితే చింతామణి ఒక భక్తిరస ప్రాధాన్యతతో కూడిన నాటకం. అయితే ఆ స్థాయిలో నాటకాలు లేవు అనుకున్న తరుణంలో చింతామణి నాటకాన్ని మరపించే రీతిలో నిలిచిన నాటకమే 'జగదేక సుందరి సామా'. రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో జరిగిన నాటక పరిషత్తు పోటీల్లో తనదైన సత్తాను చూపిస్తూ ప్రశంసల జల్లులు అందుకుంటోంది. ప్రముఖ దివంగత నంది అవార్డు గ్రహీత, సినీ, నాటక రచయిత పల్లేటి లక్ష్మీ కులశేఖర్, మరో రచయిత కళారత్న, విద్వాన్ పత్తి ఓబులయ్య కలిసి రచించిననాటకం ఇది. ఈ నాటకంలో గద్య, గీత రచనలు కులశేఖర్ చేయగా, మైమరపించే పద్య రచన పత్తి ఓబులయ్య కలం నుంచి జాలువార్చారు. దీని మూల కథను ప్రముఖ చారిత్రక నవలా రచయిత ఎస్‌డీవీ అజీజ్ అందించారు. ఈ నాటకం రేడియో రూపకంగానూ జాతీయ స్థాయిలో అనేక బహుమతులు అందుకుంది.

నాటకంలోకి వెళితే...అది 'స్పార్టకస్' బానిసత్వ వ్యవస్థలో ఉన్న కాలం. రాజులు, బానిసలు ఇద్దరే ఉన్న కాలంలో మనిషి రాజు దగ్గర బానిసగా అయినా ఉండాలి లేదా దొంగతనం చేస్తూ పొట్టపోసుకునే స్థితిలోనైనా బతకాలి. కోసల రాజ్యంలో కొంత భాగాన్ని సామాదేవి అనే నాట్యకత్తె (వేశ్య) తన వృత్తిపరంగా బాగా సంపాదిస్తూ, కొంతమంది బానిసలకు రాణిగా కొనసాగుతూ ఉంటుంది. 'ఆశయాన్ని ప్రేమ కోసం ఆహుతి చేసిన ప్రియుడు కలిసిన ప్రయాణమే ఇది ఒక ప్రేమాయణం' అంటూ కథ మొత్తాన్ని ప్రేక్షకులకు అర్థమయ్యే విధంగా నాటకాన్ని ప్రారంభిస్తారు. మాఘ అనే పేరుగల అందగాడు బానిస వృత్తికి పాల్పడకుండా దొంగతనం చేస్తూ గజదొంగగా మారిపోతాడు. మాఘ.. గంగ అనే అమ్మాయిని ప్రేమిస్తాడు. ఒకసారి దొంగతనం చేస్తూ కోసల దేశ రాజు ప్రసేనజిత్తు సైనికులకు దొరికిపోతాడు. అతన్ని బంధించి తీసుకువచ్చే సమయంలో సామారాణి అతన్ని చూస్తుంది. మనసు పడుతుంది. రాజును ప్రసేనజిత్తును ఒప్పించి మాఘను తన బానిసగా కొనుగోలు చేస్తుంది. ప్రసేనజిత్తు సామాదేవి అందానికి ముగ్దుడై, ఒప్పుకుంటే ఈ దేశానికి రాణిని చేస్తానంటాడు. కానీ ఆమె సున్నితంగా తిరస్కరిస్తుంది. ఇక మాఘను ఉక్కు సంకెళ్లు వేసి, అతనికి కావలాగా పోతరాజు అనే తన అంతరంగికుడ్ని ఏర్పాటు చేస్తుంది. సామా ప్రేమను మాఘ తిరస్కరిస్తాడు. పోతురాజు అనే బానిస మాఘ మనసు మార్చే ప్రయత్నం చేస్తాడు. అతని వల్ల ఇతర బానిసలు శిక్షించబడకూడదని, సామాదేవిని ప్రేమించమని ఆలోచనలో పడేస్తాడు. దీంతో మాఘ ఒక షరతు పెడుతూ ఆమె ప్రేమను అంగీకరిస్తాడు. దాని ప్రకారం ఇతర బానిసలందరికీ విముక్తి కల్పిస్తాడు. సామాదేవి అందుకు ఒప్పుకొని తనవద్ద నున్న బానిసలందరికీ విముక్తి ప్రసాదిస్తుంది. ఈ క్రమంలో తాను గంగను ప్రేమించానని, ఆమెకు ద్రోహంచేసి నీతో ప్రేమను పంచుకోలేనని, తనను క్షమించమంటూ విషం తాగి మాఘ తనువు చాలిస్తాడు. దీంతో సామాదేవి మనసు చుట్టు అల్లుకున్న చీకట్లు తొలగిపోతాయి. 'మహాత్యాగీ నా కళ్లు తెరిపించావు. శారీరక సుఖానికి అందం ఒక ఆభరణం అనుకున్నా...కానీ నా వృత్తి పాపకూపం అని నాకు తెలియదు...' అంటూ భోరున విలపిస్తుంది. అదే సమయంలో బౌద్ధ బిక్షువు పుణ్ణకుడు సామాదేవికి వాస్తవిక జీవన బోధ చేస్తారు.



- ఎస్. మహమ్మద్ మియా, గజల్ గాయకుడు, కర్నూలు

మనోనేత్రమే సాహిత్య క్షేత్రం

- దృష్టిలేకున్నా.. సాహిత్యంలో రాణింపు
- బ్రెయిలీ లిపిలోకి మహాకవి శ్రీశ్రీ 'మహాప్రస్థానం'
- అంధ ఉపాధ్యాయుడిగా బోధనలో విద్యార్థులకు దిక్సూచి

స్ఫూర్తి




ఉపాధ్యాయుడిగా, కవిగా రాణిస్తున్న వెంకట రాజారెడ్డి

ఆయనకు చూపులేదు... అయినా అక్షరాలను తన మనోనేత్రంతో దర్శిస్తారు. వాటికి కవితాత్మక రూపాన్ని ఇచ్చి సాహితీ ప్రియులను అబ్బుర పరుస్తారు. పద్యానికి పరిమళాన్ని అద్ది పండితులనూ మెప్పిస్తారు. కవులంతా నల్లసిరా నింపుకొన్న కలాలతో అక్షరాలు జారువారిస్తే... ఈ కవి వేలి కొసల స్పర్శతో (బ్రెయిలీ లిపితో) అక్షరాలను సృష్టిస్తారు. విధి ఆడిన వింత నాటకంలో బాల్యంలోనే చూపు కోల్పోతే, ఆత్మస్థైర్యంతోనే చదువులో ముందుకు వెళ్లారు. అంధుడిగా జీవితం చీకటి మయమైతే.. కుంగిపోకుండా అక్షరాల దివ్వెలను వెలిగించుకొని ప్రగతి బాటలో సాగిపోయారు. దృష్టిలేకపోయినా ఉపాధ్యాయుడిగా బోధనలో ఆయన వేలాది మంది విద్యార్థుల భవితకు దిక్సూచిగా నిలిచారు. తెలుగు భాషపై మమకారంతో తన మనోనేత్రంలోనే సాహితీ క్షేత్రాన్ని సృష్టించుకున్నారు. మహాకవి శ్రీశ్రీ రాసిన 'మహాప్రస్థానం' పుస్తకాన్ని తోటి అంధులు చదువుకునేలా ముద్రించారు. తెలుగు 'కళ్లం' పేరుతో ఒక సాహితీ సంస్థను స్థాపించి సాహితీ కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు కర్నూలుకు చెందిన డాక్టర్ చిన్నావుల వెంకట రాజారెడ్డి.

● కర్నూలు కల్చరల్, ఆంధ్రజ్యోతి

ప్రకాశం జిల్లా కొమ్రోలు మండలం మాధవపల్లె గ్రామంలోని వ్యవసాయ కుటుంబమైన చిన్నావుల పోలమ్మ, చిన్నావుల పుల్లారెడ్డి దంపతులకు రాజారెడ్డి 1976 మే 1న జన్మించారు. నలుగురు అన్నదమ్ములు, ఒక సోదరిల మధ్య అందరికీ చిన్నవాడిగా పుట్టిన ఆయన గ్రామంలో ప్రాథమిక విద్యాభ్యాసం ఆరంభమైంది. 1981లో 4వ తరగతిలో ఉండగా... సూర్యబింబాన్ని పూర్తిగా చూడాలన్న కోరికతో తదేక దృష్టితో చూసేవాడు. అలా కొంతకాలం పోయాక కళ్లన్నీ మసకబారుతూ వచ్చాయి. భయంతో పెద్దలకు చెప్పలేదు. కొన్ని నెలలకు దృష్టి బాగా దెబ్బతినడంతో చూపు సమస్యగా మారింది. అది దృష్టిలోపమా, లేక సూర్య కిరణాల ప్రభావమా అని తల్లిదండ్రులు గుర్తించక, రాజారెడ్డి వారికి చెప్పక పోవడం మరికొన్నాళ్లకు చూపు కోల్పోయాడు. విషయం ఆలస్యంగా తెలుసుకుని నేత్రవైద్యులను సంప్రదించినా ఫలితం లభించలేదు. అప్పటి వరకు రంగుల ప్రపంచాన్ని చూసిన రాజారెడ్డి బాల్యమే అంధత్వంలోకి జారిపోయింది.



అవార్డులు, రివార్డులు ఎన్నో

- 1996లో నాటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంగనాథమిశ్రా చేత ప్రశంసాపత్రం అందుకున్నారు.
- 2000లో నాటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేఎస్ వర్మచేత బహుమతి పొందారు.
- 2001లో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఏఎస్ ఆనంద్‌చే బహుమతి అందుకున్నారు.
- 2003లో నాటి రాష్ట్ర గవర్నర్ డాక్టర్ ఎస్ఎస్ బర్నాలా చేతుల మీదుగా ఎంఏలో గోల్డ్ మెడల్.
- 2018లో నాటి కలెక్టర్ ఎస్.సత్యనారాయణ చేత జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు.

చీకటి జీవితంలో అక్షర జ్యోతులు

బాల్యంలోనే సంభవించిన అంధత్వంతో కుంగిపోతున్న రాజారెడ్డికి అదే గ్రామానికి చెందిన ఎం.వెంకటరెడ్డి అనే అధ్యాపకుడు భుజం తట్టి మనోధైర్యాన్ని నింపాడు. ఆయన కడప అంధుల పాఠశాల్లో ఉపాధ్యాయునిగా పనిచేస్తూ, పదోన్నతిపై జూనియర్ లెక్చరల్‌గా అప్పుడే పోరుమామిళ్లకు బదిలీ అయ్యారు. ఆయనే రాజారెడ్డి జీవితానికి దిశానిర్దేశం చేశాడు. ఆయన సలహా, సూచనల మేరకు 1982లో కడపలోని రీజనల్ ప్రభుత్వ అంధుల రెసిడెన్షియల్ పాఠశాలలో తిరిగి ఒకటో తరగతిలో చేరాడు. అప్పటి వరకు అక్షరాలు రాసిన చేతి వేళ్లు...బ్రెయిలీ లిపిలో అక్షరాలను స్పర్శిస్తూ చదువు నేర్చుకోవాల్సి వచ్చింది. అక్కడి హెచ్ఎం ఎన్.శ్రీనివాస్, తెలుగు ఉపాధ్యాయుడు గంగయ్య ప్రోత్సాహంతో పాటూ అక్కడి డిప్యూటీ డీఈవో రమణయ్య ప్రోత్సాహంతో తెలుగు భాషపై రాజారెడ్డి మమకారం పెంచుకున్నారు. 1993లో స్కూల్ టాపర్‌గా 430 మార్కులతో పది ఉత్తీర్ణుడయ్యాడు. 1993-95లో తిరుపతి ఎస్వీ జూనియర్ కళాశాలలో 654 మార్కులతో కళాశాల టాపర్‌గా నిలిచారు. 1995-98 తిరుపతి ఆర్ట్స్ కళాశాల్లో క్లాస్ ఫస్టుగా నిలిచాడు. 1998-99లో కడప జిల్లా బద్వేలిలోని బిజివేముల వీరారెడ్డి బీఎడ్ కళాశాల నుంచి బీఎడ్ ప్రథమ శ్రేణిలో పాసయ్యాడు. 1999-2001లో తిరుపతి ఎస్వీయూ నుంచి ఎంఏ (తెలుగు) పూర్తి చేశారు.

మలుపు తిప్పిన ఉద్యోగ జీవితం

డీఎస్సీ ద్వారా 2001లో ఉపాధ్యాయుడుగా ఎంపికైన రాజారెడ్డి 2002 జనవరి 19న ఆలూరు మండలం అరికెర ఎంపీయూపీ పాఠశాల్లో చేరారు. 2004లో పదోన్నతిపై స్కూల్ అసిస్టెంట్ (తెలుగు)గా కోడుమూరు జడ్పీహెచ్ఎస్‌లో పనిచేశారు. 2004 ఆగస్టు 28న కోడుమూరుకు చెందిన రామకృష్ణారెడ్డి, సుశీలమ్మ దంపతుల కుమార్తె గాయత్రితో రాజారెడ్డి వివాహం జరిగింది. తెలుగు భాషపై ఉన్న మమకారం, ఆసక్తితో అంధులు చదువుకునేలా బ్రెయిలీ లిపిలోకి మహాకవి శ్రీశ్రీ 'మహాప్రస్థానం' పుస్తకాన్ని అనువదించారు. 2006లో నాటి డిప్యూటీ డీఈవో దేవదాస్, ఎంఈవో నాగరత్నంశెట్టి దీన్ని ఆవిష్కరించారు. 2008-12 మధ్య కాలంలో 'డాక్టర్ జక్కంపూడి మునిరత్నం-వచన కవిత్వం' అనే అంశంపై పరిశోధన గ్రంథం, ఆచార్య గార్లపాటి దామోదర నాయుడు పర్యవేక్షణలో పూర్తిచేసి, డాక్టరేట్ పొందారు. 2012లో బదిలీపై దిన్నెదేవరపాడు జడ్పీహెచ్ఎస్‌లో పనిచేస్తూ హెచ్ఎంగా పదోన్నతిపై నందవరం మండలం టి.సోమశిలలోని జడ్పీహెచ్ఎస్‌లో పనిచేస్తున్నారు.

తెలుగు కళ్లం సాహిత్య సంస్థ ద్వారా సేవలు



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకుంటున్న వెంకట రాజారెడ్డి

2019లో తెలుగు కళ్లం పేరుతో స్వయంగా ఒక సాహిత్య సంస్థను ఏర్పాటు చేశారు. ఈ సంస్థ ద్వారా సభలు, సమావేశాలు, ఇష్టాగోష్ఠులు, సదస్సులు ఏర్పాటు చేసి మంచి సాహిత్యాన్ని సమాజానికి అందించే దిశగా కృషి చేస్తున్నారు. అలాగే అనేక రేడియో ప్రసంగాలు చేశారు. ప్రస్తుతం ఇంటర్ చదువుతున్న కుమారుడు శ్రీకాంత్‌రెడ్డి, భార్య గాయత్రిల సహకారంతో, వారితో తన భావాలను తెలియజేస్తూ పుస్తకాలు రాస్తున్నారు. 2019లో తెలుగుధీర శతకం, 2021లో విమల దివ్యనామ వేంకటేశ (ద్విశతి), 2024లో శ్రీకాంత శతకం రాశారు. మరో పది అముద్రిత పుస్తకాలు త్వరలో వెలుగు చూడనున్నాయి.

సమన్వయంతో ముందుకు సాగాలి



సమావేశానికి హాజరైన అధికారులు

(5వ పేజీ తరువాయి)

ట్రాన్స్‌పోర్టుకు సంబంధించి ఏ వాహనం ఎక్కడికి వెళ్లాలనే విషయంలో ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలన్నారు. టోల్ గేట్స్ వల్ల ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో ఒకరోజు పాటు టోల్‌ఫీజు లేకుండా ఉచితంగా ఓపెన్ చేయాలని సూచించారు. మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సభకు సాధారణ ప్రజానీకం కూడా వచ్చేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రధానమంత్రి ప్రోగ్రాం స్పెషల్ ఆఫీసర్ వీరపాండియన్ మాట్లాడుతూ ప్రధానమంత్రి ఉమ్మడి జిల్లాలో పర్యటిస్తున్న సందర్భంగా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. శ్రీశైలంలో స్వామి వారి దర్శనం పూర్తి చేసుకున్న అనంతరం మధ్యాహ్నం కర్నూలు జిల్లాలో ఏర్పాటు చేసిన సభలో ప్రధాని పాల్గొంటారన్నారు. సభకు 3 లక్షల మంది ప్రజలు రానుండున వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాటుచేయాలన్నారు. సెక్యూరిటీ పరంగా 250 సీసీ కెమెరాలు ఏర్పాటుచేశామన్నారు. కలెక్టర్ సిరి మాట్లాడుతూ ప్రధానమంత్రి పర్యటన పనులు పకడ్బందీగా జరగాలన్నారు. పార్కింగ్ ఏరియాలో ఫుడ్ కౌంటర్, మెడికల్ టీమ్, సౌండ్ సిస్టమ్, సైన్ బోర్డ్స్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి పార్కింగ్ ఏరియాలో పార్కింగ్ నెంబరుతో సైన్‌బోర్డ్స్ ఏర్పాటు చేయాలని అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేందర్‌ను ఆదేశించారు. ప్రతి ఏరియాలో శానిటేషన్ సిబ్బంది ఏర్పాటు చేసి ప్రతి ఏరియా పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రేపటి నుంచి సభాప్రాంగణం ఎస్పీజీ వారి ఆధ్వర్యంలో ఉంటుందన్నారు. ఎస్పీజీ సెక్యూరిటీకి సహకరించాలన్నారు. ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ ప్రధాని పర్యటన విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో అధికారులు, టీడీపీ ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు తిక్కారెడ్డి, మల్లెల రాజశేఖర్, కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, డీసీఎంఎస్ ఛైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్, మీడియా కో.ఆర్డినేటర్ బి.వెంకటరాముడు పాల్గొన్నారు.



ఏర్పాట్లపై వీరపాండియన్‌తో మాట్లాడుతున్న మంత్రి ఎన్ఎండీ ఫరూక్, కలెక్టర్ సిరి



ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి టీజీ భరత్

● నన్నూరు టోల్‌గేటు వద్ద ప్రధానమంత్రి మత్స్య సంపద వయోజన పథకం కింద చేపల విలువ ఆధారిత యూనిట్‌లో భాగంగా ఏర్పాటుచేసిన వైట్ ఇన్ రెస్టారెంటును మంత్రి టీజీ భరత్, కలెక్టర్ సిరి, ఎమ్మెల్యే గౌరు చరిత ప్రారంభించారు.

రంగస్థల లక్ష్మయ్య

- పౌరాణిక నాటకాల్లో రాణిస్తున్న ఉపాధ్యాయుడు
- ఎన్నో అవార్డులు ఆయన సొంతం

కళ




చాగలమర్రి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పద్యం ఆయన ప్రాణం.. తరగతి గదిలోనైనా, రంగస్థలంపై అయినా గొంతెత్తి పద్యం పాడితే ఎవరైనా సరే ఫిదా కావాల్సిందే. ఉపాధ్యాయ వృత్తిలోనూ, రంగస్థల ప్రవృత్తిలోనూ తనకంటూ ఓ గుర్తింపును తెచ్చుకున్నారు చాగలమర్రికి చెందిన విడమకంటి లక్ష్మయ్య. చాగలమర్రి బాలికోన్నత పాఠశాలలో తెలుగు పండిట్‌గా విధులు నిర్వహిస్తున్న లక్ష్మయ్యకు చిన్న నాటి నుంచే రంగస్థలంపై మమకారం ఎక్కువ. అవకాశం వచ్చినప్పుడల్లా రంగస్థలంపై ప్రదర్శనలు ఇచ్చేవారు. 2002 జనవరి 21న ఆళ్లగడ్డ మండలం మిట్టపల్లెలో ఉపాధ్యాయ వృత్తి చేపట్టారు. పిల్లలకు పాఠం చెబుతూనే పౌరాణిక నాటకాల్లో నటిస్తూ అందరిని ఆకట్టుకున్నారు. చాగలమర్రి తదితర ప్రాంతాల్లో వివిధ వేషాలతో కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను ఉత్తేజపరిచారు. శ్రీకృష్ణుడు, అర్జునుడి పాత్రలు పోషించారు. గయోపాఖ్యానంలో శ్రీకృష్ణుడు, అర్జునుడు వంటి పాత్రలు పోషించడంతో పలువురి మన్ననలు చూరగొన్నారు. వందల సంఖ్యలో పౌరాణిక ప్రదర్శనలు నిర్వహించి ఎన్నో అవార్డులు, సత్కారాలు పొందారు.

● 2025 సెప్టెంబరు 5న సర్వేపల్లి రాధాకృష్ణ జన్మదినం సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును సీఎం చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నుంచి అందుకున్నారు.

● 1995లో సీఎం చంద్రబాబు ప్రభుత్వంలో పొదుపు సంఘాల ప్రచారంలో నాటకాలు వేస్తూ ప్రతి గ్రామంలో అవగాహన కల్పించారు. స్త్రీపాత్ర వేషదారణలో ఆయనకు ఉత్తమ పురస్కారం దక్కింది.

● 2010లో ఆలిఇండియా రేడియో ప్రసారంలో పాల్గొని పౌరాణిక నాటకాలు, వివిధ పాత్రలు ప్రదర్శించారు.

సంప్రదాయాలను ఆదరించాలి



అంతరించిపోతున్న తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ ఆదరించాలి. తల్లిదండ్రులు తమ పిల్లలకు కళల పట్ల ఆసక్తిని రేకెత్తించాలి. వాటిలో ప్రవేశం కల్పించి ప్రోత్సహించాలి. పాఠశాలల్లో సంగీత, సాహిత్య కార్యక్రమాలను నిర్వహిస్తే విద్యార్థులు సన్మార్గంలో ఎదుగుతారు.

● లక్ష్మయ్య, తెలుగు పండిట్, చాగలమర్రి



ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న లక్ష్మయ్య



సంక్రాంతి సంబరాల్లో హరిదాసు వేషధారణలో లక్ష్మయ్య

నల్లమలలో కూంబింగ్



కూంబింగ్ చేపడుతున్న గ్రేహౌండ్స్ బలగాలు


శ్రీశైలం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రధాని శ్రీశైలానికి వస్తున్న నేపథ్యంలో నల్లమల అడవిలో గ్రేహౌండ్స్ బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ప్రధానితో పాటు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్, ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రముఖులు రానున్న నేపథ్యంలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా భద్రతను కట్టుదిట్టం చేస్తున్నారు. పీఎం భద్రతకు సంబంధించిన ముఖ్య అధికారి ఆకె రవి కృష్ణ క్షేత్రస్థాయిలో పరిశీలించి సమీక్ష కూడా చేశారు. ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్, శ్రీశైలం వన్‌టౌన్ సీఐ ప్రసాద రావు, టూటౌన్ సీఐ చంద్రబాబు భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.



సోదాలు చేస్తున్న బాంబ్, డాగ్ స్క్వాడ్ బృందాలు

కొలనుభారతి క్షేత్రానికి మహర్దశ..!

- శ్రీశైల క్షేత్ర పరిధిలోకి సరస్వతీ ఆలయం
- ఉత్తర్వులు జారీ చేసిన దేవదాయశాఖ



కొలనుభారతి క్షేత్రం



ఆత్మకూరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే ఏకైక సరస్వతీ ఆలయంగా పేరుగాంచిన కొలనుభారతి క్షేత్రానికి మహర్ధశ రానుంది. సరస్వతీ అమ్మవారు కొలువైన కొలనుభారతి ఆలయాన్ని శ్రీశైల క్షేత్ర పరిధిలోకి చేర్చి అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం సంకల్పించింది. ఈ మేరకు రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కొలనుభారతి క్షేత్రాన్ని శ్రీశైలం దత్తత క్షేత్రంగా తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. దీంతో ప్రభుత్వం కూడా తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. కొత్తపల్లి మండల పరిధిలోని నల్లమల అడవుల్లో 11వ శతాబ్దానికి ముందే కొలనుభారతి క్షేత్రం ఆవిర్భవించినట్లు చరిత్ర ద్వారా తెలుస్తోంది. 11 శతాబ్దంలో రెండవ చాలుక్యులరాజుల కాలం నాటికి చెందిన మల్లభూపతిరాజు శిథిలావస్థకు చేరిన అమ్మవారి ఆలయాన్ని జీర్ణోద్ధరణ చేసి వెలుగులోకి తీసుకొచ్చినట్లు ఇక్కడి ఆలయ చరిత్ర చెబుతోంది. జగద్గురు ఆది శంకరాచార్యుల వారు విజయవాడ కనకదుర్గమ్మ, శ్రీశైల క్షేత్రంలోని భ్రమరాంబదేవి, కొలనుభారతి క్షేత్రంలోని జ్ఞానసరస్వతీ అమ్మవారుల మూటవిరాట్ ఎదుట శ్రీచక్రాన్ని ప్రతిష్ఠించినట్లు ఆలయ శాస్త్రాల ఆధారంగా తెలుస్తోంది. రాష్ట్రంలోనే ఏకైక సరస్వతీ ఆలయంగా పేరుగాంచిన కొలనుభారతి క్షేత్రాన్ని ఏవిధంగానైనా అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య గట్టి ప్రయత్నాలు చేశారు. శ్రీశైలం పరిధిలోకి కొలనుభారతి క్షేత్రాన్ని చేరిస్తేనే అభివృద్ధి సాధ్యమని భావించిన ఆయన కొలనుభారతి క్షేత్ర ప్రాశస్త్యం గురించి, ప్రస్తుత పరిస్థితుల గురించి ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లోనూ ప్రస్తావించారు.

క్షేత్రాభివృద్ధికి అవకాశం

కొలనుభారతి క్షేత్రాన్ని శ్రీశైల క్షేత్ర పరిధిలోకి చేర్చడం వల్ల క్షేత్రాభివృద్ధి మరింత మెరుగుపడే అవకాశం ఉంది. వాస్తవానికి ఇప్పటికీ అమ్మవారి ఆలయ జీర్ణోద్ధరణ పనులు పూర్తి కాలేదు. క్షేత్రానికి చేరుకునేందుకు శివపురం చెంచుగూడేం నుంచి కొలనుభారతి వరకు మట్టిరోడ్డే శరణ్యమైంది. వర్షం కురిస్తే.. ఈ రోడ్డు అధ్వానంగా మారుతోంది. క్షేత్రంలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించే చారుఘోషినీ నది మురికికుంటగా మారి దుర్గంధం వెదజల్లుతోంది. అలాగే అక్కడే సరైన వాహనాల పార్కింగ్ లేకపోవడంతో ప్రతిఏటా వసంతి పంచమి వేడుకల్లో భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. తాగునీటి సరఫరా, మరుగుదొడ్ల నిర్వహణ కూడా సక్రమంగా జరగడం లేదు. ప్రత్యేకించి దేవస్థానానికి స్థలం కొరత ఉండటంతో ప్రస్తుతం అటవీశాఖ భూభాగంలోనే కొన్ని కార్యకలాపాలు చేయాల్సిన పరిస్థితి. శ్రీశైల క్షేత్ర పరిధిలోకి కొలను భారతి క్షేత్రం చేరడం వల్ల నిధుల వినియోగం జరిగి ఆయా వసతులు మెరుగుపడే అవకాశం ఉంది.

పూర్వజన్మ సుకృతం



శ్రీశైల క్షేత్ర పరిధిలోకి కొలను భారతి ఆలయాన్ని తీసుకు రావడం నా పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నా. ఈఅవకాశం సరస్వతి అమ్మవారు తనకి కల్పించిన గొప్పవరం. భవిష్యత్తులో కొలనుభారతి క్షేత్రం కూడా బాసర తరహాలో అభివృద్ధి చెందుతుంది. భక్తులకు మెరుగైన వసతులు కల్పిస్తాం. రాష్ట్రం నలుమూలల నుంచి ఈ క్షేత్రానికి భక్తులు తరలి వస్తారు. ఇందుకు సహకరించిన సీఎం చంద్రబాబు, దేవదాయ శాఖ మంత్రికి ఆనం రామనారాయణరెడ్డికి కృతజ్ఞతలు.

● గిత్తా జయసూర్య, ఎమ్మెల్యే, నందికొట్కూరు

హోసూరులో రేషన్‌బియ్యం పట్టివేత

పత్తికొండ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ మండలంలోని హోసూరు గ్రామంలో ఓ మహిళ అక్రమంగా ఇంటిలో దాచిన రేషన్‌బియ్యంను రెవెన్యూ అధికారులు శనివారం సీజ్‌చేశారు. గ్రామానికి చెందిన అరుణారెడ్డి అనే మహిళ ఓ ఇంటిలో రేషన్‌బియ్యం అక్రమంగా నిల్వ చేసిందన్న సమాచారం మేరకు వీఆర్వో బాషా, పోలీసులతో కలసి గ్రామానికి వెళ్లారు. ఇంటికి ఉన్న తాళాలను ధ్వంసం చేసి అక్కడ ఉన్న పది బస్తాల రేషన్‌బియ్యంను సీజ్‌చేశారు. కాగా అక్టోబరు ఒకటో తేదీ తహసీల్దార్ హుసేన్‌సాబ్ సిబ్బందితో కలసి అరుణారెడ్డి ఇంటిపై దాడి చేసి అక్రమంగా నిల్వ ఉంచిన 21.5 క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని సీజ్‌చేసి కేసు నమోదు చేశారు. మళ్లీ అదే మహిళ ఇంటిపై పోలీసులు దాడులు చేయడం చర్చనీయాంశంగా మారింది. గతంలో ఎన్నిసార్లు హెచ్చరించినా ఆమె వ్యవహారంలో మార్పు రాకపోవడంతో పీడీ యాక్టు నమోదు చేసేందుకు రెవెన్యూశాఖ సిద్ధమవుతున్నట్లు సమాచారం.

రాయలసీమ రాష్ట్ర సాధనకు ఉద్యమిద్దాం

● రాయలసీమ రాష్ట్ర సమితి జాతీయ అధ్యక్షుడు కుంచం వెంకటసుబ్బారెడ్డి



మాట్లాడుతున్న కుంచం వెంకటసుబ్బారెడ్డి

చాగలమర్రి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): 2029 కల్లా ప్రత్యేక రాయలసీమ సాధించుకోవడానికి ఉద్యమిద్దామని రాయలసీమ రాష్ట్ర సమితి జాతీయ అధ్యక్షుడు కుంచం వెంకటసుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. చాగలమర్రిలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 88 ఏళ్లైనా శ్రీబాగ్ ఒప్పందం అమలు పరచకుండా రాయలసీమకు జరిగిన అన్యాయానికి నిలువెత్తు నిదర్శనం అని అన్నారు. 1937 నవంబరు 16న ఒక ఒప్పందం కుదిరిందని, 8 దశాబ్దాలలో ఒక్క అంశం కూడా అమలు కాలేదని అన్నారు. కర్నూలు రాజధాని మూడేళ్ల ముచ్చటగానే మిగిలిపోయిందన్నారు. 1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడేసరికి రాజధానిని కాస్త హైదరాబాదుకు తరలించారన్నారు. రాయలసీమ వాసులకు తీరని అన్యాయం జరుగుతోందని అన్నారు. రాయలసీమ సమస్యల గురించి, ప్రాజెక్టుల గురించి పట్టించుకోవడం లేదని అన్నారు. రాయలసీమ భవిష్యత్తు గురించి పాలకులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. శ్రీబాగ్ ఒప్పందం అమలు పరచని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయాలకు వ్యతిరేకంగా వచ్చేనెల 16న కర్నూలులోని అంబేడ్కర్ భవన్‌లో జరిగే సభకు తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ నాయకులు ఖాదర్‌వలి, ఖాసీం, సత్యనారాయణమూర్తి, కార్తీకేయరెడ్డి తదితరులు ఉన్నారు.

ఎద్దులు బెదిరి పరుగులు

● బాలుడిని తొక్కడంతో మృతి



బీరప్ప (ఫైల్)

మంత్రాలయం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూగూరు గ్రామానికి చెందిన కురువ దేవర నాగప్ప, వీరేషమ్మ దంపతుల ఒక్కగానొక్క కొడుకు బీరప్ప(5) ఎద్దుల దాడిలో తీవ్రంగా గాయపడి మృతిచెందాడు. వివరాలివీ.. ఐదేళ్ల బాలుడు బీరప్ప తన పెద్దనాన్న తరసాలప్పతో కలిసి పొలానికి వెళ్దామని మారెమ్మ దేవాలయం ముందు కూర్చున్నారు. అదే గ్రామానికి చెందిన ఖాజాకు చెందిన ఎద్దుల బండిని ఆయన బావ అయిన షేక్షావలి పొలానికి వెళ్తుండగా మారెమ్మ గుడి దగ్గరికి వచ్చేసరికి ఎద్దులు బెదిరి చిన్నారి బీరప్పను తొక్కాయి. తీవ్రంగా గాయపడ్డ బీరప్పను చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ఆసుపత్రికి తీసుకెళ్లేలోపు మృతిచెందాడు. ఒక్కగానొక్క కొడుకును ఉన్నత చదువు చదివించాలని తల్లిదండ్రులు తలిస్తే మృత్యువు ఎద్దుల రూపంలో కబళించింది. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో చదువుతున్నాడు. రెండో శనివారం సెలవు దినం కావటంతో ఇంటి వద్దే ఉన్నాడు.

ఎమ్మిగనూరులో భారీ చోరీ

● 12 తులాల బంగారు, కిలో వెండి,

● రూ.70వేల నగదు అపహరణ



పట్టణంలోని తేరుబజార్ ప్రాంతంలో ఇంట్లో చోరీకి పాల్పడిన దృశ్యం

ఎమ్మిగనూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలోని తేరుబజారు ప్రాంతంలోని ఓ ఇంట్లో భారీ చోరీ జరిగింది. తేరుబజారులోని ఆటో మెకానిక్ యూసుఫ్ తన భార్య అనారోగ్యంతో ఉండటంతో చికిత్స నిమిత్తం ఆదోనికి వెళ్లి శనివారం వచ్చాడు. అప్పటికే దొంగలు ఇంటిపై నుంచి లోపలికి వెళ్లికి చోరీకి పాల్పడ్డారు. బీరువాను తెరిచి అందులో ఉన్న 12 తులాల బంగారు నగలు, ఒక కిలో వెండి, రూ.70వేల నగదును దోచుకెళ్లారు. దొంగతనం అనంతరం ఆనవాళ్లు లేకుండా చేసేందుకు బీరువాతో పాటు ఇతర ప్రాంతాల్లో కారంపొడి చల్లివెళ్లారు. ఆదోని నుంచి ఇంటికి వచ్చిన బాధితుడు యూసుఫ్ చోరీకి గురైనట్లు గుర్తించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేపట్టారు. కాగా ఇటీవలే పట్టణంలోని గాంధీనగర్‌లో ఓ ఉపాధ్యాయురాలి ఇంట్లో చోరీ సంఘటనను మరువక ముందే మరో చోట దొంగలు భారీ చోరీకి పాల్పడటంతో పట్టణ వాసులు భయాందోళనలకు గురవుతున్నారు.

పోక్సో కేసు నమోదు : నిందితుడి అరెస్టు

కర్నూలు క్రైం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన ఖాజాబాషా అనే నిందితుడ్ని పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక కల్లావీధికి చెందిన ఖాజాబాషా ఈ నెల 9వ తేదీన తన ఇంటి సమీపంలో ఉండే బాలికను చాక్లెట్ ఆశ చూపి బైక్‌పై ఎక్కించుకుని తీసుకెళ్లాడు. ఆ తర్వాత నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆ బాలికపై అఘాయిత్యానికి పాల్పడపోగా.. బాలిక కేకలు వేసింది. దీంతో స్థానికులు గర్తించి ఖాజాబాషాను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఆ తర్వాత తల్లిదండ్రులు తమ కూతురు కనిపించకపోయేసరికి వెతుకుంటూ వెళ్లగా.. స్థానికుల సాయంతో ఆ బాలికను గుర్తించారు. శనివారం ఆ బాలిక చెప్పిన విషయాలతో పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కేసును నమోదు చేసి ఖాజా బాషాను అదుపులోకి తీసుకుని పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు. గతంలో కూడా ఖాజాబాషా 2020లో జరిగిన ఓ కేసులో కూడా ముద్దాయిగా ఉన్నారు. గతంలో కూడా ఓ బాలికపై ఇదే విధంగా అనుచితంగా ప్రవర్తించాడని పోలీసులు వెల్లడించారు.

చికిత్స పొందుతూ కౌలు రైతుల మృతి

● కోడుమూరు మండలంలో ఒకరు.. నంద్యాలలో మరొకరు..





శేఖర్, సుబ్బరాయుడు (ఫైల్)

కోడుమూరు రూరల్/నంద్యాల టౌన్, అక్టోబరు 11, (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఆత్మహత్యాయత్నం చేసిన రైతులు చికిత్స పొందుతూ మృతి చెందారు. కోడుమూరు మండలంలోని గోరంట్లలో ఒకరు, నంద్యాల మండలంలోని చాపిరేవుల గ్రామంలో ఒకరు మృతి చెందారు.

వివరాలివీ.. కోడుమూరు మండలంలోని గోరంట్ల గ్రామానికి చెందిన గుమ్మిశెట్టి శేఖర్ (50) మూడేళ్ల నుంచి 6 ఎకరాలు కౌలు తీసుకుని పంటలు సాగుచేస్తున్నారు. ఉల్లి, పత్తి వంటి పంటల సాగులో తీవ్రనష్టాలు చవిచూశారు. పంటలసాగులో కౌలు, పెట్టుబడుల కోసం చేసిన అప్పులు రూ. 10 లక్షలు పెరిగిపోయాయి. దీంతో జీవితంపై విరక్తిచెంది శుక్రవారం గ్రామశివారులో పురుగుమందు తాగారు. అటుగా వస్తున్న కొందరు గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హుటాహుటిన అక్కడి నుంచి కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందారు. శేఖర్‌కు భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

●నంద్యాల మండలంలోని చాపిరేవుల గ్రామానికి చెందిన కౌలు రైతు గొల్ల సుబ్బరాయుడు (65) 25 ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు మిరప పంట సాగు చేశారు. దీంతో ఇప్పటి దాకా సాగు కోసం చేసిన అప్పు సుమారు రూ.75 లక్షలు అయింది. అప్పు చెల్లించే మార్గం లేక మనస్తాపంతో ఈనెల 8న పురుగుల మందు తాగారు. అయితే నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. సుబ్బరాయుడుకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కీళ్లు.. కన్నీళ్లు



● కాలు కదిపినా భరించలేని నొప్పి
● యువతనూ వేధిస్తోన్న ఆర్థరైటిస్ సమస్య
● ఉమ్మడి జిల్లాలో 3 లక్షల మంది వ్యాధిగ్రస్థులు
● గుర్తించిన వెంటనే చికిత్స తీసుకుంటే ఉపశమనం
● అందుబాటులో ఆధునిక వైద్యం
● నేడు వరల్డ్ ఆర్థరైటిస్ డే

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): అన్నీ సక్రమంగా ఉంటేనే పనులు చేసుకోవడానికి అవస్థలు పడుతుంటాం. అలాంటిది ఆర్థరైటిస్ వస్తే కదలడమే కష్టం. కాలు కదిపినా కన్నీళ్లు వస్తాయి. ఒకప్పుడు 50 ఏళ్లు దాటిన వారికి ఆర్థరైటిస్ (కీళ్ల నొప్పులు) వచ్చేవి. ప్రస్తుతం 25 ఏళ్లు పైబడి వారిలో 15 శాతం ఈ వ్యాధితో బాధపడుతున్నారు. 1990లో ప్రపంచ వ్యాప్తంగా 25.6 కోట్ల నాటికి ఈ సంఖ్య 58.5 కోట్లకు చేరింది. 2050కల్లా ఈ సంఖ్య 100 కోట్లకు పెరగవచ్చునని అంటారు. ఓ వైపు కీళ్లకు పోషణ తక్కువ కావడం, మరో వైపు అధిక బరువు, స్థూలకాయం వల్ల కీళ్లపై ఒత్తిడి పెరగడం వల్ల ఆ కీళ్ల వ్యాధులు పెరుగుతున్నాయి. ఒకప్పుడు 60 ఏళ్లపై బడిన వారికి వచ్చే ఆర్థరైటిస్ నేడు యువతను సైతం పట్టి పీడిస్తున్నాయి. ప్రాథమిక దశలో ప్రాథమిక దశలో కీళ్ల వ్యాధులను గుర్తించి వైద్యులను సంప్రదిస్తే వ్యాధిని నయం చేయవచ్చు. ఈ క్రమంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ 1996 నుంచి ప్రతి ఏటా అక్టోబరు 12న వరల్డ్ ఆర్థరైటిస్ డే నిర్వహిస్తూ వస్తోంది. ఈ ఏడాది మీ కలలను సాకారం చేసుకోవడం, రుమాటిక్ మాస్క్యులోస్కెలెటర్ వ్యాధులతో (ఆర్ఎండీ) జీవిస్తున్న వ్యక్తులు వారి సామర్థ్యాన్ని గ్రహించడానికి ముందుకు సాగాలన్నది ఈ థీమ్ ఉద్దేశ్యం.

కర్నూలు జీజీహెచ్‌కు బాధితుల క్యూ

ఉమ్మడి జిల్లాలో కీళ్ల వ్యాధిగ్రస్థులు ఏటా పెరుగుతూనే ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో 3 లక్షల మంది కీళ్ల వ్యాధులతో బాధపడుతున్నారు. ఇక కర్నూలు జీజీహెచ్‌లోని ఆర్థోపెడిక్ విభాగానికి ప్రతి రోజు 300 నుంచి 400 మంది దాకా ఓపీకి రోగులు వస్తుంటారు. ఇందులో 80 మంది ఆర్థరైటిస్ వ్యాధిగ్రస్థులే ఉంటున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఇక ప్రైవేటు ఆసుపత్రుల్లో కూడా ఇదే పరిస్థితి. ప్రస్తుతం విష జ్వరాలు ప్రబలుతుండడం, డెంగీ బాధిస్తుండడంతో వీరిలో ఎక్కువ మంది కీళ్ల నొప్పులతో బాధపడుతున్నారు. ఇదిలా ఉంటే కృత్రిమ కీళ్ల మార్పిడిలో ఉమ్మడి జిల్లాలో పలు ప్రైవేటు ఆసుపత్రులు గుర్తింపు తెచ్చుకున్నారు. ఇక కర్నూలు జీజీహెచ్‌లోని ఆర్థోపెడిక్ విభాగంలో మోకాళ్ల కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్సలు ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా నిర్వహిస్తున్నారు. అయితే ఇంప్లాంట్ మాత్రం రోగులపై భారం పడుతుంది. దీంతో ఇంప్లాంట్ కొనలేని పేద రోగులు వెనుదిరుగుతున్నారు.

అందుబాటులో ఆధునిక వైద్యం

కీళ్ల అరుగుదల వల్ల వచ్చే కీళ్ల వాపు వ్యాధులకు ఎన్నో ఆధునిక వైద్య విధానాలు అందుబాటులోకి వచ్చాయి. నాలుగు దశలో ఈ వ్యాధికి చికిత్సలు అందిస్తున్నారు. మొదటి దశలో వైద్యుడిని సంప్రదించి పెయిన్ కిల్లర్స్ వాడటం, ఫిజియోథెరపీ చేయించుకోవడం. రెండో దశలో కీళ్లలో జిగురు కోసం మందులు వాడటం, మూడోదశలో లోపల జాయింట్‌లు శుభ్రపరచడం జరుగుతుంది. నాలుగో స్టేజీలో కీళ్ల మార్పిడి (టోటల్ జాయింట్ రీప్లేస్‌మెంటు) ఆపరేషన్ ద్వారా ఆర్థోరైటిస్ వ్యాధిని నయం చేయవచ్చు.

తొలి దశలోనే గుర్తిస్తే మెరుగైన చికిత్స



ఆర్థరైటిస్ వ్యాధిని తొలిదశలోనే గుర్తించాలి. అప్పుడే సమర్థమైన చికిత్స అందించవచ్చు. ఆర్థరైటిస్ లక్షణాలు అందరిలోనూ ఒకేలా ఉండవు. ఇది కొద్దిపాటి తీవ్రత నుంచి తీవ్రమైన లక్షణాల వరకు ఉండవచ్చు. ఏళ్ల తరబడి కనిపించడంతో పాటు కాలం గడిచే కొద్ది తీవ్రత పెరగవచ్చు. తొలిదశలో ఆకలి తగ్గడం, జ్వరం, బాగా నీరసించిపోవడం వంటివి కనిపిస్తాయి. ఎక్స్‌రే, సీటీ స్కాన్, ఎంఆర్ఐ పరీక్షలతో పాటు కొన్ని రకాల అడ్వాన్స్‌డ్ పరీక్ష సహాయంతో వ్యాధి నిర్ధారణ జరుగుతుంది. ఈ వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే ఒకదశలో శరీర వైకల్యాలు రావచ్చు.

● డా.ఎ.సృజన, రుమటాలజిస్టు, మెడికవర్ హాస్పిటల్, కర్నూలు

ఓపీకి 70 నుంచి 80 మంది రోగులు



ఆర్థోపెడిక్ విభాగానికి రోజుకు 300 నుంచి 400లకు పైగా రోగులు వస్తుంటారు. ఇందులో కాళ్లు వంకరపోవడం, నడుస్తున్నప్పుడు మోకాల్లో శబ్దం రావడం, మెట్లు ఎక్కలేకపోవడం, కింద కూర్చోలేకపోవడం వంటి లక్షణాలతో ఆర్థరైటిస్‌తో బాధపడుతూ 70 నుంచి 80 మంది వస్తుంటారు. ఇలాంటి వారు వ్యాధిని త్వరగా గుర్తించి మందులు వాడుతూ బీపీ, షుగర్ వ్యాధిని నియంత్రణలో పెట్టుకుని ఫిజియోథెరపీ చేయించుకోవాలి. నాలుగో స్టేజీలో జాయింట్ రీప్లెస్‌మెంటు సర్జరీ చేయించుకోవాలి.

● డా.డి.రాజయ్య, ప్రొఫెసర్ అఫ్ ఆర్థోపెడిక్, ప్రభుత్వ సర్వజన వైద్యశాల, కర్నూలు

రోబోటిక్ పద్ధతిలో ఆపరేషన్లు



ఎముకల్లో గుజ్జు అరుగుదల, థైరాయిడ్, వ్యాయామం చేయకపోవడం, ఒబెసిటీ వల్ల ఆర్థరైటిస్ వస్తుంది. ఎక్కువగా కింద కూర్చోవడం వల్ల అరుగుదల పెరుగుతుంది. మోకాళ్లు ఎక్కువగా అరిగిపోవడం వంటి సమస్యకు ఆధునిక పద్ధతిలో గత 8 నెలల క్రితం రోబోటిక్ పద్ధతిలో మోకాళ్ల ఆపరేషన్లు నిర్వహిస్తున్నాం. ఇప్పటి వరకు 100 రోబోటిక్ పద్ధతిలో ఆపరేషన్లు చేశాం. ఇవి కాకుండా ఆర్థరైటిస్‌తో బాధపడుతున్న వారికి ఇప్పటి వరకు 10వేల మోకాళ్ల ఆపరేషన్లు చేశాం. ఆర్థరైటిస్ వ్యాధి అనేక మందిని ఇబ్బందులకు గురి చేస్తుంది. మోకాళ్లు బాగా అరిగిపోయిన వారికి, కదలిక తగ్గిన వారికి జాయింట్ రీప్లేస్‌మెంటు సర్జరీ మంచి పరిష్కారం.

● డా.ఎం.విజయకుమార్ రెడ్డి, సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్, శ్రీచక్ర హాస్పిటల్, కర్నూలు

కుటుంబాన్ని బలిగొన్న గ్యాస్

ఆ దంపతులది రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబం. సొంతిల్లు కూడా లేదు. సొంతూరిలోనే వారపాకలో అద్దెకు ఉంటూ వ్యవసాయ పనులకు వెళ్తూ జీవనం సాగిస్తున్నారు. అయితే ఆ కుటుంబాన్ని విధి కూడా చిన్నచూపు చూసింది. గ్యాస్ రూపంలో మృత్యువు ఆ కుటుంబాన్ని కబళించింది. గ్యాస్ లీకేజీ కావడంతో గాయపడ్డ కుటుంబ సభ్యుల్లో.. దంపతులతో పాటు మూడేళ్ల కుమారుడు చికిత్స పొందుతూ మృతి చెందారు. పెద్ద కుమారుడు కూడా చావుబతుకుల మధ్య కొట్టిమిట్టాడుతున్నాడు. తమలాంటి దుర్భర జీవితం తమ పిల్లలకు రాకూడదని ఆ తల్లిదండ్రులు పెద్ద కుమారుడిని చదివించుకుంటున్నారు. చిన్న కుమారుడిని కూడా బాగా చదివించాలని కలలు కన్నారు. ప్రస్తుతం మహిళ గర్భిణి కూడా. అయితే శిశువు కూడా అమ్మ గర్భంలోనే కన్నుమూసింది. కలలో కూడా ఊహించని ఈ ఘటన ఆ కుటుంబాన్ని చిన్నాభిన్నం చేసింది.

● కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృత్యుఒడిలోకి..
● లీకేజీ ఘటనలో మొత్తం ముగ్గురి మృతి
● వీరిలో ఓ గర్భిణి కూడా..
● ఎస్.బోయినపల్లిలో విషాదం





సువర్ణ, నాగరాజు (ఫైల్)



మృతి చెందిన చరణ్ (ఫైల్)

వెల్దుర్తి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): గ్యాస్ లీకేజీ ఘటనలో తీవ్రంగా గాయపడి చికిత్సపొందుతూ ముగ్గురు మృతి చెందారు. ఈ విషాద ఘటన మండలంలోని ఎస్.బోయినపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన నాగరాజు (40), సువర్ణ (32) దంపతులు వ్యవసాయ పనులకు వెళ్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి అనిల్, చరణ్(3) ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈనెల 5న అర్ధరాత్రి అద్దెకు ఉంటున్న వారపాకలో నిద్రిస్తున్న సమయంలో గ్యాస్ లీకు కావడంతో మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో నలుగురూ తీవ్రంగా గాయపడ్డారు. దీంతో వారిని మెరుగైన వైద్యం కోసం కర్నూలు సర్వజన వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం నాగరాజు మృతిచెందగా, శనివారం తెల్లవారుజామున చరణ్, సాయంత్రం సువర్ణ మృతి చెందారు. నాగరాజు, చరణ్ అంత్యక్రియలు శనివారం ఎస్.బోయినపల్లిలో నిర్వహించారు. గర్భిణి సువర్ణ అంతిమ సంస్కారాలు ఆదివారం నిర్వహించనున్నారు. అనిల్ పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు బంధువులు తెలిపారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మరణించడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పెద్ద కుమారుడు అనిల్ గ్రామంలోని ఎంపీపీ స్కూల్‌లో నాలుగో తరగతి చదువుతున్నాడు.

చికిత్స పొందుతూ మహిళ మృతి



శశికళ (ఫైల్)

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): బలవన్మరణానికి పాల్పడిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. గ్రామీణ పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం గువ్వలదొడ్డి గ్రామానికి చెందిన శశికళ(30) అదే గ్రామానికి ధనుంజయ్యగౌడ్ ప్రేమించుకున్నారు. వీరిద్దరి కులాలు వేరు కావడంతో పెద్దలు పెళ్లి నిరాకరించారు. ధనుంజయ్యగౌడ్‌కు ఎర్రకోట గ్రామానికి చెందిన ఓ యువతి పెళ్లి చేసుకున్నాడు. శశికళను మంత్రాలయానికి చెందిన ఓ యువకుడితో వివాహం జరిపించారు. కొన్నాళ్లు ఎవరి జీవితాల్లో వారు సంతోషంగా ఉన్నారు. శశికళ నువ్వేకావాలంటూ ప్రియుడు ధనుంజయ్య వద్దకు వచ్చేసింది. విషయం తెలుసుకున్న పెద్దలు శశికళను నచ్చజెప్పి భర్త దగ్గరకు పంపారు. కొన్నాళ్లకు మరోసారి ఆమె ప్రియుడి వద్దకు వచ్చేసింది. గత్యంతరం లేక ప్రియుడు ఆమెను ఓ హాస్టల్‌లో ఉంచాడు. పెళ్లి చేసుకోవాలని లేదంటే ఆత్మహత్య చేసుకుంటానని వేధించేది. ఈనెల 5వ తేదీన ఫ్యాన్‌కు ఉరేసుకున్నట్లు ఫొటోను తీసి ధనుంజయ్యగౌడ్‌కు పంపింది. భయభ్రాంతులకు గురైన అతడు పొలంలో పురుగుమందు తాగాడు. కుటుంబ సభ్యులు ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా మృతిచెందాడు. సోమవారం అతడి అంత్యక్రియలను గ్రామంలో నిర్వహించారు. ప్రియుడు మృతిచెందడం.. భర్త, పిల్లలు దూరం కావడంతో జీవితంపై విరక్తి చెంది శశికళ సోమవారం పురుగుమందు తాగి బలవన్మరణానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంలో కర్నూలుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి మృత్యువాత పడింది. శనివారం ఆమె అంత్యక్రియలు గువ్వలదొడ్డిలో నిర్వహించారు. శశికళకు ఇద్దరు కుమారులు ఉన్నారు. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆపరేషన్ కోసమని వస్తే..

● వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటున్న బంధువులు
● మృతదేహంతో హాస్పిటల్ ఎదుట ఆందోళన
● కార్డియాక్ అరెస్టు అంటున్న వైద్యులు



హాస్పిటల్ ఎదుట మృతదేహంతో ఆందోళన చేస్తున్న బంధువులు

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): హార్ట్ ఆపరేషన్ కోసమని వచ్చిన ఓ వ్యక్తి ఆరోగ్య పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఈ ఘటన నగరంలోని కొత్తబస్టాండు సమీపంలో ఉన్న ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చోటుచేసుకుంది. దీంతో ఆగ్రహించిన బంధువులు మృతదేహంతో హాస్పిటల్ ఎదుట ఆందోళన చేశారు. మునగాలపాడుకు చెందిన పెద్ద మాదన్న(56) గుండె సంబంధిత సమస్యతో కల్లూరులోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌కు వెళ్లాడు. అక్కడి నుంచి ఈ నెల 5న కొత్తబస్టాండు సమీపంలోని హాస్పిటల్‌కు వెళ్లారు. అక్కడ మోషన్ దగ్గర రక్తస్రావం ఉండటంతో మూ డు రోజుల ఐసీయూలో ఉంచి చికిత్స అందించారు. హార్ట్ ఆపరేషన్‌కు ఏర్పాటు చేశారు. శనివారం అంతా సిద్ధంచేసి ఆపరేషన్ వాయిదా వేస్తున్నట్లు ఉదయం 10 గంటలకు వైద్యులు ప్రకటించారు. మధ్యాహ్నం 12 గంటలకు రోగి చనిపోయాడని వైద్యులు తెలిపారు. దీంతో బంధువులు ఆగ్రహానికి గురై శవంతో హాస్పిటల్ ఎదుట ఆందోళనకు దిగారు. న్యాయం జరిగే వరకు ఆందోళన విరమించేది లేదని భైఠాయించారు. చివరకు పోలీసులు రంగ ప్రవేశం చేసి బాధితులతో మాట్లాడి ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకున్నారు. ఈ ఘటనపై హాస్పిటల్ యాజమాన్యం వివరణ ఇస్తూ రోగికి మోషన్ బ్లీడింగ్ అవుతుంటే మూడు రోజులు ఐసీయూలో ఉంచి ఆరోగ్యశ్రీ కింద చికిత్స చేశామన్నారు. తర్వాత కార్డియాక్ట్ అరెస్టుతో చనిపోయాడని, వైద్యుల నిర్లక్ష్యం లేదంటూ వివరించారు.

చైన్ స్నాచర్ అరెస్టు

కర్నూలు క్రైం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చైన్ స్నాచింగ్ పాల్పడిన రాజారెడ్డి అనే నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఏడాది జనవరిలో వెంకటాద్రి నగర్‌లో తులిశమ్మ అనే మహిళ మెడలో నుంచి ఓ గుర్తు తెలియని వ్యక్తి చైన్ స్నాచింగ్ చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు రాజారెడ్డిని నిందితుడిగా గుర్తించి అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి రూ.లక్ష నగదుతో పాటు కొంతమేర బంగారు నగలు స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు.

విద్యార్థి మృతి

మహానంది, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మహానంది సమీపంలోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ కళాశాలకు చెందిన మూడో సంవత్సరం ఏజీ బీఎస్సీ చదువుతున్న జనార్దన్ నాయక్(21) పాలేరు వాగులో ఈతకు వెళ్లి మృతి చెందారు. ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపిన వివరాలివీ.. శనివారం కళాశాలకు సెలవురోజు కావడంతో కళాశాల సమీపంలోని పాలేరువాగు వద్దకు మిగతా విద్యార్థులతో కలిసి దుస్తులు శుభ్ర పరుచుకొనేందుకు వెళ్లారు. అనంతరం వాగులో ఈత కొట్టే క్రమంలో జనార్దన్ నాయక్ తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. చికిత్స కోసం నంద్యాలకు తరలిస్తుండగా మార్గ మధ్యంలోనే మృతి చెందాడు. విద్యార్థి స్వస్థలం చిత్తూరు జిల్లా జిల్లెల మండలం పెద్దతండా. శనివారం సాయంత్రం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొన్న తల్లితండ్రులు విగతా జీవిగా పడి ఉన్న కుమారుని మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నంద్యాలలో గోల్డ్ ఎగ్జిబిషన్ ప్రారంభం



ఫిరోజ్‌ను సన్మానిస్తున్న యజమానులు

నంద్యాల నూనెపల్లి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): నంద్యాల చామకాల్వ సమీపంలోని సౌజన్య ఫంక్షన్ హాల్‌లో అన్సర్ డైమండ్ అండ్ గోల్డ్ జ్యూవెలరీ ఆధ్వర్యంలో 5వ సారి ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నాణ్యతలో అన్సర్ జ్యూవెలరీ రాజీ పడదని అన్నారు. అన్సర్ జ్యూవెలరీ యజమానలు అన్సర్, అమీర్ మాట్లాడుతూ ఈనెల 13వ తేదీ వరకు ఈ ఎగ్జిబిషన్ కొనసాగుతుందని తెలిపారు. ప్రతి లక్షరూపాయల కొనుగోలుపై ఒక వెండి కాయిన్, ప్రతి రూ25 వేల కొనుగోలుపై ఒక్క లక్కీ కారు, బైక్ కూపన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో షేక్ మహబూబ్ జిలానీ, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని సభను జయప్రదం చేద్దాం

- నందికొట్కూరు, శ్రీశైలం ఎమ్మెల్యేలు జయసూర్య, రాజశేఖర్‌రెడ్డి
- కార్యకర్తలతో వేర్వేరుగా సమీక్ష

నందికొట్కూరు రూరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ ఈనెల 16న కర్నూలుకు రానున్నారని, నన్నూరు టోల్ ప్లాజా సమీపంలో ఏర్పాటు చేసిన సభను విజయవంతం చేద్దామని నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య కోరారు. శనివారం మండలంలోని అల్లూరు గ్రామంలో బీజేపీ రాష్ట్ర కమిటీ సభ్యుడు దామోదరరెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి రవికుమారుతో కలిసి అన్నిశాఖల అధికారులు, నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మాండ్ర సురేంద్రనాథరెడ్డి, నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు దేవెల్ల మురళి, కార్యక్రమ కోఆర్డినేటర్ గురుమూర్తి, మార్కెట్‌యార్డ్ చైర్మన్ ప్రసాదరెడ్డి, మండల కన్వీనర్లు ఖాతా రమేష్‌రెడ్డి, మహేశ్‌రెడ్డి, క్లస్టర్ కోఆర్డినేటర్లు, అధికారులు పాల్గొన్నారు.


అల్లూరులో మాట్లాడుతున్న నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత

జాతీయ రహదారి పనుల్లో బొళ్లవరం గ్రామానికి చెందిన బోయ పక్కీరయ్య ప్రమాదవశాత్తు మృతి చెందాడు. బాధిత కుటుంబానికి జాతీయ రహదారి నిర్మాణ కంపెనీ నుంచి రూ. 15,50,000 చెక్కు మంజూరైంది. శనివారం బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే జయసూర్య, గ్రామ పెద్దలు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ చైర్మన్ ప్రసాదరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

వేల్పనూరులో..

వెలుగోడు: ప్రధాని మోదీ శ్రీశైలానికి ఈనెల 16న రానున్నరని ఆయన పర్యటనను విజయవంతం చేద్దామని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి కోరారు. శనివారం వేల్పనూరులో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు, ప్రధాని పర్యటన కమిటీ కన్వీనర్ రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి, పార్టీ పరిశీలకులు వైవీ సుబ్బారావు, శ్రీశైలం నియోజకవర్గంలోని ముఖ్య నాయకులతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని మోదీ సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కృషితో శ్రీశైల క్షేత్రం అభివృద్ధి చెందనుందన్నారు. కూటమి నాయకులు భారీగా తరలివచ్చి కార్యక్రమం జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.


వేల్పనూరులో మాట్లాడుతున్న శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

గిట్టుబాటు ధరలు కల్పించడంలో విఫలం

- ఏపీ రైతు సంఘం నాయకులు
- పట్టణంలో ర్యాలీ

ఆత్మకూరు రూరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమైనట్లు ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.ప్రభాకరరెడ్డి ఆరోపించారు. శనివారం పట్టణంలోని రైతు సంఘం జిల్లా రెండవ మహాసభ జిల్లా అధ్యక్షుడు రమేష్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. పట్టణంలోని మార్కెట్ యార్డు నుంచి ర్యాలీ నిర్వహించారు. స్థానిక గౌడ్ సెంటరులో మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కరణల పేరుతో వ్యవసాయం, పారిశ్రామిక రంగాన్ని ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. వ్యవసాయాన్ని కార్పొరేట్ సంస్థల కబంధ హస్తాల్లోకి వెళ్లేలా సంస్కరణలు చేస్తున్నారన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించకుండా మొండి చేయి చూపుతున్నారని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రాజెక్టుల పేరుతో కూటమి ప్రభుత్వం పెద్ద ఎత్తున భూములను లాక్కుంటున్నారన్నారు. రాష్ట్రం లో మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేస్తున్నారని విమర్శించారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజ శేఖర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏసురత్నం మాట్లాడుతూ.. ఆత్మకూరు ప్రాంతంలోని పాములపాడు కొత్తపల్లి ఏరియాల్లో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులను నిర్మిస్తే ఆ ప్రాంతం సస్యశ్యామంతో పాటు ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయన్నారు. నంద్యాల జిల్లాలో పొగాకు రైతులను ఆదుకోవడంలో జిల్లా ప్రజా ప్రతినిధులు విఫలం చెందారని విమర్శించారు. ఆయా సమస్యలపై ఉద్యమాలకు సిద్ధపడుతున్న రైతు సంఘానికి మద్దతు ఇవ్వాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం, సీఐటీయూ, రైతు సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రభాకరరెడ్డి



ర్యాలీ నిర్వహిస్తున్న రైతు సంఘం నాయకులు

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి


సమావేశంలో పాల్గొన్న వాల్మీకి నాయకులు

నందికొట్కూరు రూరల్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి) : వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని వాల్మీకి హక్కుల పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని అల్లూరు సమీపంలో గల ఎస్ఎస్ ఫంక్షన్ హాల్‌లో వాల్మీకుల చైతన్య సభ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వాల్మీకి బోయ హక్కుల పోరాట సమితి నాయకుడు జెక్కుల శ్రీనివాసరావు, మహర్షి వాల్మీకి రిజర్వేషన్ పోరాటసమితి నాయకుడు బోయపులి కొండన్న, వాల్మీకి న్యాయవాదుల సంఘం నాయకుడు జే వెంకటరాముడు హాజరయ్యారు. సమావేశంలో జెక్కుల శ్రీనివాసరావు మాట్లాడుతూ భారత దేశంలో ఏ రాష్ట్రంలో చూసినా వాల్మీకులు ఎస్సీలుగానో, ఎస్టీలుగానో ఉన్నారన్నారు. ఒక్క మన తెలుగు రాష్ట్రాలలో మాత్రం రాజకీయ కుట్రలకు బలిపశువులుగా మారి ఏజెన్సీ, మైదాన ప్రాంతమంటూ విడదీసి వాల్మీకులను బీసీలుగా చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ఏమాత్రం సమంజసం కాదన్నారు. సమాజంలో అన్నిరకాలుగా వెనుకబడిన వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వాల్మీకి నాయకులు గుజుల గౌరీశ్వరనాయుడు, రాముడు, రమణ, బొళ్లవరం రవి పాల్గొన్నారు.

ఆపదలో శక్తియాప్ ఆయుధం

మహానంది, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఆపద సమయంలో శక్తి యాప్ ఆయుధం లాంటిందని నంద్యాల శక్తి టీం హెడ్ కానిస్టేబుల్ డీఎన్ ప్రసాద్ అన్నారు. శనివారం మహానంది మండలం ఎం.తిమ్మాపురంలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో విద్యార్థినులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. హెడ్ కానిస్టేబుల్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని కచ్చితంగా శక్తి యాప్‌ను తమ తల్లిదండ్రుల ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకొని ఆపద సమయంలో శక్తి ఆప్లో ఎస్ఓఎస్ కాల్స్ అనే ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవాలన్నారు. బాధితుల లైవ్ లొకేషన్ పోలీసులకు చేరుతుందన్నారు. పోలీసులు వెంటనే రంగంలోకి దిగి సహాయం చేసే అవకాశం ఉందన్నారు. అలాగే సైబర్‌క్రైం, బాల్య వివాహాలు, మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నంద్యాల శక్తి టీం సభ్యులు వెంకటేశ్వర్లు, రఫీ, ఉపాధ్యాయిలు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న పోలీసులు


వెంకట్రామయ్య మృతదేహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే బుడ్డా

వెంకట్రామయ్య మృతి తీరని లోటు: ఎమ్మెల్యే

మహానంది, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మహానంది మండలం బొల్లవరం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు గడ్డం వెంకట్రామయ్య మృతి పార్టీకి తీరని లోటు అని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. అనారోగ్యంతో మృతి చెందిన వెంకట్రామయ్య మృతదేహానికి శనివారం ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ధైర్యంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో కేసీ కెనాల్ ప్రాజెక్ట్ అధ్యక్షుడు బన్నూరి రామలింగారెడ్డి, టీడీపీ మండలాధ్యక్షుడు కంచెర్ల శివశంకర్ చౌదరి, మహానంది ఆలయ మాజీ చైర్మన్ కంచెర్ల సురేష్‌రెడ్డి, ప్రముఖ న్యాయవాది తాతిరెడ్డి తులసిరెడ్డి, నాయకుడు బుడ్డారెడ్డి శ్రీనివాసరెడి, మారెడ్డి జయరాం, సుబ్రమాణ్యం పాల్గొన్నారు.

శ్రీశైలానికి పోటెత్తిన భక్తులు

శ్రీశైలానికి శనివారం భక్తుల పోటెత్తారు. రెండు రోజులు సెలవులు రావడంతో స్వామి, అమ్మవార్ల దర్శనానికి ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, మహా రాష్ట్ర నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ మాడ వీధులన్నీ సందడిగా మారాయి. శ్రీశైలానికి చేరుకున్న భక్తులు కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా సౌకర్యాలపై అధికారులు దృష్టి సారించారు.

● శ్రీశైలం, ఆంధ్రజ్యోతి



బాణసంచా నిల్వలపై చర్యలు

- ఏఎస్పీ మందా జావళి

నంద్యాల టౌన్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): బాణసంచా నిర్వాహకులు అక్రమంగా, అనుమతులు లేకుండా బాణ సంచా నిల్వ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ మందా జావళి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రానున్న దీపావళికి బాణ సంచా నిర్వాహకులు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని సూచించారు. సరియైన భద్రతా ప్రమాణాలు పాటించాలన్నారు. అలాగే ఫైర్ సెఫ్టీ అధికారుల నుంచి కూడా అనుమతులు పొందాలన్నారు. ప్రజలు నివాస ప్రాంతాల్లో, టపాకాయాలు విక్రయించరాదన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రదేశాల్లో మాత్రమే విక్రయించాలన్నారు. ఎవరైనా నిబంధనలు పాటించకుండా విక్రయిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

అనుమతులు తీసుకోవాలి: డీఎస్పీ

ఆత్మకూరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): రానున్న దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని అనుమతులు తీసుకొని టపాసులను విక్రయించాలని డీఎస్పీ రామాంజీనాయక్ సూచించారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ఆత్మకూరు పోలీసు డివిజన్ పరిధిలో అను మతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా టపాసులు విక్రయిం చినా, నిల్వ చేసినా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రభుత్వ అనుమతులతో ఏర్పాటయ్యే దుకాణాల వద్ద అగ్ని ప్రమాదాలు వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఆర్టీసీ కానిస్టేబుళ్లపై చర్యలు తీసుకోవాలి


డిపోలో నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

ఆత్మకూరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు ఆర్టీసీ డిపో పరిధిలో పనిచేస్తున్న సెక్యూరిటీ కానిస్టేబుళ్లపై చర్యలు తీసుకోవాలని స్థానిక డిపో జేఏసీ నాయకులు శీలయ్య, వెంకటేశ్వర్లు, కేఎం రావు, ఎంసీఎస్ రెడ్డి, ఏకాంబరం, బ్రహ్మం, విల్సన్ డిమాండ్ చేశారు. శనివారం విధులు బహిష్కరించి ఎర్రబ్యాన్లు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆత్మకూరు ఆర్టీసీ డిపో పరిధిలో సెక్యూరిటీ కానిస్టేబుళ్ల కరిమున్నిసా, నాయక్ ఆర్టీసీ ఉద్యోగులపై అనుచితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వీరిపై అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించకపోవడం శోచనీయమన్నారు. ఉన్నతాధికారులు స్పందించి సెక్యూరిటీ కానిస్టేబుల్స్‌పై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు, ఆలం నరసానాయుడును సన్మానిస్తున్న శ్రీదేవి

నంద్యాల రూరల్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ఈనెల 16న ప్రధాని మోదీ ఉమ్మడి కర్నూలు జిల్లాల పర్యటను విజయవంతం చేయాలని నియోజకవర్గ పరిశీలకుడు ఆలం నరసానాయుడు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని టీడీపీ (రాజ్ థియేటర్) కార్యాలయంలో కార్యకర్తలతో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నంద్యాల నియోజకవర్గం నుంచి వేలాదిగా కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం నూతనంగా శ్రీశైలం ట్రస్టు బోర్డు సభ్యురాలిగా ఎంపికైన జిల్లెల్ల శ్రీదేవి ఆలం నరసానాయుడును సన్మానించారు. కార్యక్రమంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మనియార్ ఖలీల్, కౌన్సిలర్లు నాగార్జున, గోస్పాడు కన్వీనర్ తులసీశ్వరరెడ్డి, శివశంకర్‌యాదవ్, ఇలియాజ్, దూదేకులు దస్తగిరి నాయకులు పాల్గొన్నారు.

'శాంతిరాం'లో ముగిసిన సదస్సు


విద్యార్థినికి బహుమతి అందిస్తున్న ప్రిన్సిపాల్

పాణ్యం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్ఈ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన సిగ్మా సమన్వయ 2కె25 సాంకేతిక సదస్సు శనివారం ముగిసింది. సదస్సులో విద్యార్థులు తమ ప్రతిభలను ఆవిష్కరించారు. డాన్స్ , మెలోడీ వాయిస్, క్యాట్ వాక్, మిస్ మ్యాచ్ ర్యాంప్‌లో వాక్, మెహిందీ, పెయింటింగ్ , ఫొటోగ్రఫీ విభాగాల్లో విద్యార్థులు పాల్గొని తమ సృజనాత్మకతను చాటుకున్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విజేతలను కళాశాల చైర్మన్, ఎండీలు శాంతిరాముడు, శివరాంలు అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, హెచ్‌వోడీలు ఫరూక్, రమాదేవి, డేవిడ్ సుకీర్తికుమార్ పాల్గొన్నారు.

లైసెన్సులు లేకుండా బాణసంచా విక్రయించొద్దు


దుకాణాదారులతో మాట్లాడుతున్న సీఐ రాము

ఆత్మకూరు రూరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని టపాకాయల విక్రయదారులు లైసెన్సులు లేకుండా టపాకాయలు విక్రయిస్తే చర్యలు తప్పవని ఆత్మకూరు సీఐ రాము హెచ్చరించారు. ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్ ఆదేశాల మేరకు శనివారం రాత్రి సీఐ, పోలీస్ సిబ్బంది తనిఖీలు చేపట్టారు. పట్టణంలోని కిషన్‌సింగ్ వీధి, వెంగల్‌రెడ్డి నగర్, కప్పలకుంట ప్రాంతాల్లోని పలు దుకాణాలలో తనిఖీలు నిర్వహించి అగ్గిపెట్టెలు, రీల్స్‌ను సీజ్ చేశారు. అనంతరం పలు దుకాణ యజమానులను స్థానిక పోలీస్ స్టేషన్‌కు పిలిపించి ప్రభుత్వ నిబంధనలు పాటించాలని సూచించారు.

శ్రీశైలంలో కళారాధన

శ్రీశైలం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి) : శ్రీశైలదేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా నిత్యకళారాధనలో శనివారం లాస్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ కూచిపూడి డ్యాన్స్ హైదరాబాద్ వారిచే సంప్రదాయ నృత్యప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా వినాయకకౌత్వం, శంభోమహాదేవ తదితర గీతాలకు ధన్య శ్రీ,మౌనిక, తేజస్విని, రామకృష్ణ నృత్యప్రదర్శన చేశారు.

న్యాయవాదిని అరెస్టు చేయాలి

- సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు


నిరసన తెలుపుతున్న నాయకులు

నందికొట్కూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్‌పై దాడి చేసిన న్యాయవాది రాకేష్ కిషోర్‌ను తక్షణమే అరెస్టు చేయాలని సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ నాయకులు గాబ్రియల్ అధ్యక్షతన నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా నాయకురాలు ఎస్‌బీబీ లక్ష్మీదేవి, మణికుమారి, ఏసన్న, శేఖర్, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

ఓంకారం క్షేత్రాభివృద్ధికి పాటుపడాలి


ప్రమాణస్వీకారం చేస్తున్న పాలక మండలి సభ్యులు

బండిఆత్మకూరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): నూతన పాలక మండలి సభ్యులు ఓంకార క్షేత్రాభివృద్ధికి పాటుపడాలని కేసీ కెనాల్ ప్రాజెక్టు అభివృద్ధి కమిటీ చైర్మన్ బన్నూరు రామలింగారెడ్డి సూచించారు. శనివారం ఓంకారం ఆలయంలో ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి, ఈవో ఆకృతి నాగప్రసాద్ ఆధ్వర్యంలో నూతన పాలక కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం కార్యక్రమం నిర్వహించారు. చైర్మన్‌గా అల్లె చెన్నారెడ్డి, సభ్యులుగా ఐతా చంద్రశేఖర్, నారాయణ, శేఖర్, వెంకటేశ్వరరావు, బాల మద్దిలేటి, గీత, సుబ్బలక్ష్మమ్మ, లక్ష్మీదేవి, దివ్య, హేమలత ప్రమాణం చేశారు. శ్రీశైలం ఎంఎల్‌ఏ బుడ్డా రాజశేఖర్‌రెడ్డి సహకారంతో ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని నూతన చైర్మన్ చెన్నారెడ్డి అన్నారు. కార్యక్రమంలో శ్రీశైలం ట్రస్టు బోర్డు మాజీ సభ్యుడు డాక్టర్ చిటిబొట్ల భరద్వాజశర్మ, మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి చలమయ్య, టీడీపీ సీనియర్ నాయకులు, సొసైటీ చైర్మన్లు పాల్గొన్నారు.

రాజ్యాధికారమే ధ్యేయం


మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు రంగనాయుడు

నంద్యాల రూరల్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీలు రాజ్యాధికారమే ధ్యేయంగా పని చేయాలని సీపీఐ, బీసీ సంఘాల నాయకులు రంగనాయుడు, మంజుల సబ్బరాయుడు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలో జనగణనతో పాటు కులగణన జరగాలన్నారు. బీసీ యొక్క ఐక్యత చాటుకోవాలన్నారు. బీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించకుండా చేయడం మంచిదికాదన్నారు. బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం కేటాయించాలన్నారు. సమావేశంలో బీసీ, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

బెల్లం ఊట ధ్వంసం


బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్‌శాఖ సిబ్బంది

నందికొట్కూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నీలిషికారి కాలనీలో శనివారం ప్రొహిబిషన్ , ఎక్సైజ్ శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 220 లీటర్ల బెల్లం ఊటను, 10 లీటర్ల నాటు సారాను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్‌శాఖ ఎస్ఐ ఎస్. జఫ్రూల్లా తెలిపారు. అనంతరం బ్రాందీ, కల్లు దుకాణాలను తనిఖీ చేసి లైసెన్స్‌దారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కర్నూలు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ మారుతి ప్రసాద్, హెడ్‌కానిస్టేబుళ్ల కృపవరకుమారి, పద్మనాభం, రామాంజనేయులు, కానిస్టేబుళ్ల మధుసూదన్ ప్రసద్, శ్వేతా రాణి, రమీజాబి, అల్లా స్వామి, జయచంద్రుడు, మధుసూధన్‌రెడ్డి పాల్గొన్నారు.

కాల్వలో నవజాత శిశువు శవం లభ్యం

నంద్యాల టౌన్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలోని విశ్వన గర్‌లోని మురుగు కాల్వలో నవజాత శిశువు మృతదేహం శనివారం లభ్యమైనట్లు టూ టౌన్ సీఐ అస్రర్‌బాష తెలిపారు. సీఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విశ్వనగర్‌లో కాల్వలో దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పూర్తిగా నెలలు నిండని మగ శిశువును గుర్తు తెలియని వ్యక్తులు పడేసి వెళ్లినట్లు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని టూ టౌన్ పోలీసులు ఐసీడీఎస్ అధికారులకు అప్పజెప్పారు. విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

నంద్యాల టౌన్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలోని బైర్మల్ వీధిలో ఒంటరిగా వెళ్తున్న వ్యక్తిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. పోలీసులు, బాధితుడి వివరాల ప్రకారం.. నందమూరి నగర్‌కు చెందిన చాంద్‌బాషా పట్టణంలోని కూరగాయల మార్కెట్‌కు వెళ్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి దాడి చేసి రూ.3వేలు లాక్కొని వెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఇటీవల వన్, టూ టౌన్ ప్రాంతంలో ఇలాంటి ఘటనలు వరుసగా జరుగుతుండడంతో ప్రయాణికులు, పాదచారులు భయభ్రాంతులకు గురవుతున్నారు.పోలీసులు నిఘా పెంచి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రేపు ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం

శ్రీశైలం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం సోమవారం నిర్వహించనున్నట్లు చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 12గంటల మధ్యలో ప్రమాణ స్వీకారం ఉంటుందన్నారు. వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, 20 సూత్రాల చైర్మన్ లంక దినకరణ్, విష్ణువర్ధన్‌రెడ్డి, పలువురు ప్రముఖులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

అహోబిలంలో వైభవంగా పవిత్రోత్సవం



పూజలు చేస్తున్న పీఠాధిపతి

ఆళ్లగడ్డ, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలం లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు శనివారం వైభవంగా నిర్వహించారు. పవిత్రోత్సవాలలో ఐదో రోజు ఆలయ ప్రధాన అర్చకులు కిడాంబి వేణుగోపాల్ స్వామి ఆధ్వర్యంలో వేదపండితులు శ్రీలక్ష్మీనరసింహస్వామి శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను హోమ మండపంలో కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. అహోబిలం మఠం 46వ పీఠాధిపతి శ్రీవన్ శఠగోప శ్రీరంగనాథ యతీంద్ర మహాదేశికన్ పర్యవేక్షణలో తమిళనాడు నుంచి వచ్చిన ప్రత్యేక అర్చక బృందం వేద ప్రబంధ పారాయణాలు, నిత్యపూజ, తిరుమంజనం, కుంభ ప్రోక్షణం చేశారు. అనంతరం ప్రహ్లాద వరద స్వామికి అమ్మవార్లకు మంగళహారతి అందించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను పల్లకిపై కొలువు దీర్చి తిరువీధులలో గ్రామోత్సవం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

అంతర్ పంటల సాగుతో లాభాలు

మార్కెట్‌యార్డు చైర్మన్ మల్లికార్జునరెడ్డి



మాట్లాడుతున్న మల్లికార్జునరెడ్డి

బనగానపల్లె, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): రైతులు అంతర్ పంటలు సాగు చేసే లాభాలు సాధించవచ్చునని బనగానపల్లె మార్కెట్ యార్డు చైర్మన్ కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి అన్నారు. శనివారం బనగానపల్లె పట్టణ శివారులోని యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రంలో కేవీకే కో-ఆర్డినేటర్ ధనలక్ష్మి అధ్యక్షతన ప్రధానమంత్రి ధన ధ్యాన్య కృషి యోజన ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరై కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ రైతులు అంతరపంటలు సాగు, పంట మార్పిడి పద్ధతులు పాటిస్తే లాభాలు పొందవచ్చునని అన్నారు. అనంతరం నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన సహాసంచాలకుడు డాక్టర్ జాన్సన్, జిల్లా వ్యవసాయాధికారి మద్దిలేటి, కేవీకే శాస్త్రవేత్తలు సుధాకర్ , బాలరాజులు మాట్లాడారు. అపరాల పంట సాగు పద్ధతులు, ప్రకృతి వ్యవసాయం గురించి వివరించారు. నాణ్యమైన విత్తనాలు, చిరుధాన్యాల విలువాధారిత ఉత్పత్తులు, ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ప్రదర్శించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ భూషన్న, ఉపసర్పంచ్ బురానుద్దీన్, వై శ్రీనివాసులు, సురేశ్ కుమార్, వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి, కేవీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సబ్సిడీ శనగ విత్తనాలు పంపిణీ

బనగానపల్లె, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): యాగంటి పల్లె కృషి విజ్ఞాన కేంద్రంలో శనివారం బనగానపల్లె మార్కెట్‌యార్డు చైర్మన్ కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి మద్దిలేటిలు రైతులకు సబ్సిడీపై శనగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా మండల వ్యవ సాయాధికారి సుబ్బారెడ్డి మాట్లాడుతూ మండలానికి ఈ ఏడాది 1900 క్వింటాళ్ల సబ్సిడీ శనగ విత్తనాలు మంజూరయ్యాయన్నారు. క్వింటా ధర రూ.78 00లు అని సబ్సిడీ ధర ప్రతి క్వింటాలుకు రూ.1950లు అని రైతులు చెల్లించాల్సింది రూ.5850లు అన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వని యోగం చేసుకోవాలని కోరారు. జిల్లా వ్యవసాయాధికారి మద్దిలేటి, నం ద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం డైరెక్టర్ జాన్సన్ కేవీకే కోఆర్డినేటర్ ధనలక్ష్మి, వైస్ చైర్మన్ భూషన్న, ఉపసర్పంచ్ బురానుద్దీన్, రైతులు, పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే మోదీ ధ్యేయం

డోన్ టౌన్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ధ్యేయమని ఏపీ బిజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు హేమసుందర్ రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని పోస్టాఫీసులో పీఎం విశ్వకర్మ యోజన లబ్ధిదారులైన కొత్తపల్లి గ్రామా నికి చెందిన సుంకన్నకు చెప్పులు కుట్టే మిషన్ పరికరాలు పనిముట్లు పంపిణీ చేశారు. హేమసుందర్ రెడ్డి మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కుల వృత్తుల వారికి ఉచితంగా శిక్షణ ఇచ్చి, శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత వారికి ఉచితంగా రూ.15వేలు విలువగల పనిముట్లు ఉచితంగా అందిస్తుందని అన్నారు. పోస్టుమాస్టర్ కృష్ణ నాయక్, విశ్వకర్మ ఇంప్లిమేంటేషన్ మెంబర్ ఆర్మీ రామయ్య, వెంకటేశ్వర్లు, నాయకులు హరినాయుడు, ముదిరాజ్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

డివిజన్ స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

కొలిమిగుండ్ల, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కొలి మిగుండ్లలో నిర్వహించిన మండల స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన 160 మంది విద్యార్థులను డివిజన్ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎంఈవో అబ్దుల్‌కలాం, క్రీడల కోఆర్డినేటర్ వై.నాగ రాణి శనివారం తెలిపారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, చెస్, షటిల్ బ్యాడ్మింటన్ తదితర 7విభాగాల్లో ప్రతిభ చూపిన బాల బాలికలను మొత్తం 160 మంది డివిజన్ స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు.

నేడు ఎమ్మెల్యే కోట్ల రాక

ప్యాపిలి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణానికి ఆదివారం డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి రానున్నట్లు శనివారం పార్టీ వర్గాలు తెలిపాయి. స్థానిక ప్రభుత్వ విశ్రాంత గృహంలో ఈ నెల 16న కర్నూలు నిర్వహించే ప్రధాని మోదీ సభపై కార్యకర్తలతో ఆయన సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపాయి. టీడీపీ నాయకులు, కార్యకర్తలు తప్పక సమావేశానికి హాజరుకావాలని పార్టీ వర్గాలు తెలిపాయి.

ప్రకృతిని కాపాడుకుందాం : జనసేన



మొక్క నాటుతున్న జనసేన నాయకులు

డోన్ రూరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రకృతిని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని డోన్ జనసేన నియోజకవర్గ నాయకులు ఆలా మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం జనసేన యువ నాయకులు షైబేల్ ఆధ్వర్యంలో పాతబస్టాండు రైల్వేస్టేషన్ రోడ్డులో ప్రజలకు మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. అంతకు ముందు పాతబస్టాండు జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జనసైనికులు మొక్కలు నాటారు. అనంతరం డోన్ ప్రభుత్వ ఆసుపత్రిలో పేదలకు, రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు.

ప్రజల ప్రాణాలతో చెలగాటం

- విచ్చలవిడిగా నకిలీ మందుల విక్రయాలు
- నామమాత్రంగా అధికారుల తనిఖీలు



డోన్ టౌన్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): డోన్ పట్టణంలో మెడికల్ షాపుల యజమానులు నకిలీ మందులను విచ్చలవిడిగా విక్రయిస్తూ రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారనే విమర్శలున్నాయి. నకిలీ మందులు చెలా మణి అవుతున్నా.. సంబంధిత అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. పట్టణంలో నాణ్యత లేని మందులు వారి స్వలాభం కోసం విక్రయిస్తూ రోగుల జేబులకు చిల్లులు వేస్తూ కొందరు డాక్టర్లు రూ.లక్షల్లో ఆర్జిస్తున్నారనే ఆరోపణలున్నాయి. కొందరు అనర్హత కలిగిన వైద్యుల సైతం వైద్యులుగా చెలామణి అవుతూ బినామీ పేర్లను తమ హాస్పిటల్స్ వద్ద రాయించి రోగులను మోసం చేస్తున్నారు. అయితే ఔషధ నియంత్రణ శాఖ అధికారులు మొక్కుబడిగా తనిఖీలు చేసి కేసులు నమోదు చేస్తున్నారు. దరఖాస్తు చేసుకుంటే చాలు.. డ్రగ్స్ అధికారులు వెంటనే కొత్త లైసెన్సుల మంజూరు చేస్తున్నారు. మందుల షాపుల లైసెన్సులు ఒకరి పేరు మీదుగా ఉండగా.. మరొకరి పేరు మీద నిర్వహిస్తున్నారనే సత్యాన్ని అధికారులు గుర్తించినా వాటి గురించి అసలు పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి నకిలీ మందులను అరికట్టి ప్రజల ప్రాణాలను కాపాడాలని పలువురు కోరుతున్నారు.

నకిలీ మందులను అరికట్టాలి



పట్టణంలో విచ్చలవిడిగా నకిలీ మందులను విక్రయిస్తున్న మందుల షాపులపై చర్యలు తీసుకోవాలి. పట్టణంలో అనుమతులు లేకున్నా కొన్ని షాపులు విచ్చలవిడిగా ఏర్పాటు చేస్తున్నారు. కొందరు మెడికల్ షాపుల యజమానులు నకిలీ మందులను విక్రయిస్తూ రోగుల ప్రాణాలతో చెలగాట మాడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు తనిఖీలు ముమ్మరం చేసి నకిలీ మందులను అరికట్టాలని కోరారు.

● నక్కి శ్రీకాంత్,
సీపీఐ పట్టణ కార్యదర్శి, డోన్

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

మెడికల్ షాపుల యజమానులు ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు. జీఎస్టీ ట్యాక్స్ 5 శాతం తగ్గించి మందులను విక్రయించాలి. అలాగే ఎవరైనా కాలం చెల్లిన మందులను, అధిక ధరలకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

● ఎస్ జయరాముడు, ఔషధ అధికారి, కర్నూలు రూరల్

వరద నీటి పరిశీలన



అడ్డవాగు వరద నీటిని పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

చాగలమర్రి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని గోపాయలపల్లె రహదారిలోగల అడ్డవాగు పొంగి ప్రవహించి వరద నీరు రహదారి వెంట ప్రవహిస్తోంది. ఈ నీటిలో నుంచే కూలీలు రైతులు రాకపోకలు చేయాల్సి వస్తోంది. శనివారం విషయం తెలుసుకున్న టీడీపీ రాష్ట్ర మైనార్టీసెల్ ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా, పట్టణ అధ్యక్షుడు మౌళాలి, కార్యదర్శి కొలిమి అస్రఫ్‌తో పాటు టీడీపీ నాయకులు కలిసి వరద నీటిని పరిశీలించారు. రైతులు, కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 2 వేల ఎకరాల దాక పంటలు సాగు చేసుకోవాల్సి వస్తోందని, వరద వచ్చినప్పుడల్లా పంట పొలానికి వెళ్లేందుకు కష్టాలు తప్పడం లేదని రైతులు వారితో మొరపెట్టుకున్నారు. ఈ విషయం ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జల్సాగౌస్, బారిక్‌చామల్, మాబాషా పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి విరాళాలు



రుద్రవరం: దాతలకు రసీదు అందజేస్తున్న దృశ్యం

చాగలమర్రి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లాల క్షేత్రంలోగల చెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర ఆలయాల అభి వృద్ధికి బత్తలూరుకు చెందిన దాతలు వసంతరావు, కవిత దంపతులు రూ.20 వేలు, వసంతపేటకు చెందిన శ్రీనివాసులు రూ.20 వేలు నగ దును ఆలయ కమిటీ సభ్యులకు శనివారం అందజేసి తమ ఉదారతను చాటుకున్నారు. కమిటీ సభ్యులు దాతలను సన్మానించి అభినందించారు. అనంతరం చెన్నకేశవ, సంజీవరాయ స్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణరెడ్డి, సుబ్బిరెడ్డి, ఆదినారాయణరెడ్డి, ప్రధాన అర్చకులు పాల్గొన్నారు.

రుద్రవరం: మండలంలోని వాసాపురం వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి నంద్యాల పట్టణానికి చెందిన రాజారావు, వసంత సుందరి దంపతులు శనివారం లక్షా 116లను విరాళంగా అందించారు. ఈ విరాళాన్ని చైర్మన్ మధుసూదనరెడ్డి, వైస్ చైర్మన్ రంగనాయకులు, ట్రెజరర్ నరసింహులుకు అందించారు. దాతలు మాట్లాడుతూ ఆలయానికి విరాళం అందించడం సంతోషంగా ఉందన్నారు.

ఆలయ నిర్మాణానికి..



దాతలను సన్మానిస్తున్న అర్చకులు విహారి స్వామి

డోన్ టౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శనేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి డోన్ పట్టణానికి చెందిన వ్యాపారవేత్త (కళాంజలి మెన్స్‌వేర్) ఎం.లక్ష్మీకాంతశెట్టి, ఎం.గీతాప్రియ దంపతులు రూ.99,999 విరాళం శనివారం అందజేశారు. ఈ సందర్భంగా దాతలను అర్చకులు విహారి స్వామి శాలువతో సన్మానించారు. అనంతరం వారు కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారికి దర్శించుకున్నారు.

టీడీపీతోనే బీసీల సంక్షేమం



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణగౌడ్

చాగలమర్రి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే బీసీల సంక్షేమం సాధ్యమని మండల బీసీ సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్ అన్నారు. శనివారం చాగలమర్రి బీసీ సంఘ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వరంలాంటిదని అన్నారు. సూపర్-6 పథకాలు అమలు చేయడంపై ప్రజలు హర్షిస్తు న్నారని అన్నారు. కేంద్రం ప్రవేశ పెట్టిన జీఎస్టీ పేదలకు ఎంతో మేలు చేకూరుతుందని తెలిపారు. నాయకులు రామతీర్థం, వీరయ్య, లాలయ్య, సిద్ధప్ప, చిన్నికృష్ణయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.

కోతకు గురైన కల్వర్టు

ఇబ్బంది పడుతున్న రైతులు



బోడెమ్మనూరు రస్తాలో కోతకు గురైన కల్వర్టు

ఉయ్యాలవాడ, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని ఆయా కల్వర్టులు కోతకు గురవుతున్నాయి. మండలంలోని రూపనగుడి గ్రామ సమీపంలో బోడెమ్మనూరు రస్తాలో కుందూనదికి ఆనుకొని ఉన్న కల్వర్టు కోతకు గురైంది. ఆరు అడుగుల లోతుకు మట్టి కోతకు గురికావటంతో కల్వర్టు పూర్తిగా దెబ్బతినింది. కల్వర్టుపైన ఉన్న కంకర రాళ్లు కొట్టుకొనిపోయి గుంతలు పడ్డాయి. దీనిపై రాకపోకలు ఇబ్బందికరంగా మారింది. రైతులు పొలాలకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి కల్వర్టుకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మహాసభలను జయప్రదం చేయాలి

బేతంచెర్ల, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): విశాఖపట్టణంలో డిసెంబరు 31 నుంచి వచ్చే ఏడాది జనవరి 4వ తేదీ వరకు జరిగే సీఐటీయూ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎల్లయ్య, అంగన్‌వాడీ జిల్లా అధ్యక్షురాలు షేభారాణి పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో పట్టణ ఉపాధ్యక్షులు రామాంజనేయులు అధ్యక్షతన సీఐటీయూ కార్మిక సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. కార్యక్ర మంలో నాయకులు జి.వేణుగోపాల్, అంగన్‌వాడీ పట్టణ కార్యదర్శి ఎస్. గుల్జార్బీ, ఆశా వర్కర్స్ యూనియన్ పట్టణ కార్యదర్శి నాగేంద్రమ్మ, నాయకులు డి.రాజు, రామకృష్ణ, శ్రీనివాసులు, ఎస్‌కే బాషా పాల్గొన్నారు.

వణికిస్తున్న విషజ్వరాలు

- పట్టించుకోని అధికారులు
- ఇబ్బంది పడుతున్న గ్రామస్థులు



జ్వరంతో మంచం పట్టిన దాహీద్, రంగ రామసుబ్బారెడ్డి, జ్వరం బారిన పడిన చిన్నారి ఆదర్శ

కోవెలకుంట్ల, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని బిజినవేముల గ్రామంలో గత పది రోజులుగా విషజ్వరాలతో ప్రజలు అల్లాడుతు న్నారు. ముందుగా జ్వరంతో ప్రారంభమై కీళ్ల నొప్పులు రావటం, కాళ్ల వాపులు రావడం మంచం దిగ లేని పరిస్థితిలో ఉన్నారు. గ్రామంలో దాహీద్, అనీఫా, ఒబినా, క్రిష్ణవేణి, శివకుమారి, శివారెడ్డి, ఆదర్శ, రంగరా మసుబ్బారెడ్డి, బాబు ప్రసాద్, హేమ, తబసూన్, అవుకు పద్మావతి, వెంకటస్వామి, భక్త శేషారెడ్డి, మురళీమోహన్, పెద్ద చౌడయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, భక్తప్ర హల్లాదరెడ్డిలతో పాటు గ్రామంలో సుమారు 200 మందికి పైగా విష జ్వరాలు సోకి అల్లాడుతున్నారు. గ్రామంలో విష జ్వరాల బారిన పడి ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నా అధికారులు గ్రామం వైపు కన్నెత్తైనా చూడకపోవటం దారుణమని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. కోవెలకుంట్ల, నంద్యాల, కర్నూలు తదితర పట్టణాలకు వెళ్లి ప్రైవేటు వైద్యశాలల్లో వేల డబ్బులు ఖర్చు చేస్తున్నా జ్వరాలు తగ్గటం లేదని వారు ఆరోపిస్తున్నారు. డబ్బు స్థోమతలేని పేదవారు కోవెలకుంట్ల ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి వైద్యం చేయించుకుంటున్నామన్నారు. జ్వరాలు తగ్గినప్పటికీ కీళ్ల నొప్పులు తగ్గటం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా వైద్యాధికారులు స్పందించి గ్రామంలో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అనుమతులు లేకుండా టపాసులు విక్రయించొద్దు: సీఐ



వ్యాపారులతో మాట్లాడుతున్న సీఐ రమేష్‌బాబు

కొలిమిగుండ్ల, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా అనుమతులు లేకుండా టపాసులు విక్రయించరాదని, దుకాణాలు ఏర్పాటు చేయరాదని కొలిమిగుండ్ల సీఐ మద్దినేని రమేష్‌బాబు అన్నారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో టపాసుల వ్యాపారులకు సీఐ అవగాహన కల్పించారు. అనుమతులు లేకుండా టపాసుల దుకాణాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం

శిరివెళ్ల, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యలపై పోరాడుతున్నామని ఎస్టీయూ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మౌళాలి, ఆజం బేగ్, శివప్రసాద్ అన్నారు. డీఎస్సీ-2025లో ఎంపికైన ఉపాధ్యాయులను ఎస్టీయూ ఆధ్వర్యంలో శిరివెళ్లలోని షైన్ స్కూల్‌లో శనివారం సన్మానించారు. అనంతరం 2026-27 సంవత్సరానికి గాను ఎస్టీయూ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మం డల గౌరవాధ్యక్షుడిగా రంగస్వామి, అధ్యక్షుడిగా శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా చాంద్‌బాషా, పద్మావతిలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో శివ శంకర్, చంద్రశేఖర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మండలానికి 33 మంది ఉపాధ్యాయులు

కొలిమిగుండ్ల, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): నూతన డీఎస్సీ నియామకాల్లో భాగంగా కొలిమిగుండ్ల మండలానికి మొత్తం 33 మంది ఉపాధ్యాయులు రానున్నట్లు ఎంఈవో అబ్దుల్‌కలాం శనివారం తెలిపారు. రెండు మూడు రోజుల్లోనే నూతన డీఎస్సీ ఉపాధ్యాయులు తమ తమ స్థానాల్లో బాధ్యతలు స్వీకరిస్తారన్నారు.

పైపులైన్ పనులకు నిధులు మంజూరు

డోన్ రూరల్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): వెంకటనాయునిపల్లె గ్రామంలో శాశ్వత తాగునీటి పరిష్కారానికి పైపులైన్ పనులకు డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని రూ.35 లక్షల నిధులు మంజూరు చేశారు. హంద్రీనీవా ద్వారా గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం ఏర్పాటు చేసే ప్రత్యేక పైపులైన్లు పనులు చేపట్టేందుకు ఎమ్మెల్యే నిధులు మంజూరు చేయించడంపై టీడీపీ నాయకులు సీలం భాస్కర్ నాయుడు హర్షం వ్యక్తం చేశారు.

పార్కుల అభివృద్ధికి కృషి

డోన్ టౌన్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పార్కుల అభి వృద్ధికి కృషి చేస్తామని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ ఆఫీసులో గల పార్కును కౌన్సిల్ సభ్యులతో కలిసి చైర్మన్ రాజేష్ సందర్శించారు. అధ్వానంగా ఉన్న పార్కు నిర్వహణను చూసి సిబ్బందిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. శానిటరీ ఇన్స్‌పెక్టర్, ఇంజనీరింగ్ సిబ్బంది ఉన్నారు.

విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించాలి

రుద్రవరం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించాలని ఆళ్లగడ్డ ఏడీఈ సుబ్రహ్మణ్యం వినియోగదారులకు సూచించారు. శనివారం విద్యుత్ బిల్లుల వసూళ్లకై రుద్రవరాన్ని ఆయన సందర్శించారు. లైన్‌మెన్ ఖాజా, కాంట్రాక్టర్ ఉన్నారు.

రోడ్డుకు మరమ్మతులు



గుంతలకు సిమెంటు, ఇసుక వేస్తున్న కూలీలు

ప్యాపిలి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గార్లదిన్నె గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు దెబ్బతినడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోలేదు. దీంతో జలదుర్గం ఎస్ఐ నాగార్జున ఆధ్వర్యంలో రోడ్డుపై ఏర్పడిన గుంతలు పూడ్చి మరమ్మతులు చేయించారు.

అభివృద్ధి పనుల తనిఖీ



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణంలో జరుగుతున్న అండర్ డ్రైనేజీ అభివృద్ధి పనులను రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అండర్ డ్రైనేజీ పనులకు స్వయంగా పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి సంబంధిత అధికారి, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు సంబంధించి నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కోరారు. ఆయా అభివృద్ధి పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోరారు. అండర్ డ్రైనేజీ అభివృద్ధి పనులపై, ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.

అహోబలం సినిమా పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పీఠాధిపతి

ఆళ్లగడ్డ, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలంలో లక్ష్మీనరసింహా స్వామి దేవస్థానంలో శనివారం అహోబలం సినిమాకు సంబంధించిన పోస్టర్‌ను పీఠాధిపతి రంగనాథ యతీంద్ర మహాదేశికన్ స్వామి ఆవిష్కరించారు. ఈసందర్భంగా పారిశ్రామిక వేత్త చిత్ర నిర్మాత శెట్టి విజయ్ కుమార్ మాట్లాడుతూ అహోబలం సినిమాను ఆలయ విశిష్టత, తరాలుగా వస్తున్న ఆచారాల గురించి ప్రజలకు తెలియజేయాలన్న ఉద్దేశంతో సినిమాను తీర్చిదిద్దామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు గుడూరు సంజీవరాయుడు, సినిమా దర్శకుడు జగదీష్, కో డైరెక్టర్ అజయ్, చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన



మాట్లాడుతున్న సీఐ

బేతంచెర్ల, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ట్రాక్టర్ల డ్రైవర్లకు, యజమానులకు బేతంచెర్ల సీఐ వెంక టేశ్వరరావు రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ డ్రైవర్లకు తప్పనిసరిగా లైసెన్సు కలిగి ఉండాలన్నారు. ఎస్ఐ-2 తిరుపాలు, పోలీసు సిబ్బంది, డ్రైవర్లు, యజమానులు పాల్గొన్నారు.

సమాన వేతనం ఇవ్వాలి

దొర్నిపాడు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం, బీమా సౌకర్యం, రిటర్‌మెంట్ బెనిఫిట్ రూ.10 లక్షలు అందించాలని విద్యుత్ లైన్‌ఇన్‌స్పెక్టర్ కుక్కలయ్య కోరారు. ఈనెల 13న ఏపీ పవర్ జేసీ ఆధ్వర్యంలో చలో విజయవాడ కార్యక్ర మాన్ని నిర్వహిస్తున్నామన్నారు. విద్యుత్ సిబ్బంది గోపాల్‌రెడ్డి, నాగయ్య, సురేంద్ర, హరి పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి పల్లకీ ఉత్సవం

చాగలమర్రి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముడురాళ్లపల్లె గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తుల పల్లకీ ఉత్సవం నిర్వహించారు. శనివారం వేదపండితుల ఆధ్వర్యంలో పవిత్రోత్సవం నిర్వహించారు.